

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	230	260
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 23.0

నాలుగేళ్లలో ప్రాజెక్టులను పూర్తి చేస్తాం :ఉత్తమ్



బీఆర్ఎస్ హయాంలో పదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైన ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గాన్ని కూడా ఈ టర్మ్‌లోనే పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ అన్నారు. అక్కడ జరిగిన ప్రమాదంతో తాత్కాలిక ఇబ్బందులను అధిగమించి పనులు చేయిస్తామన్నారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో 80ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిండి ఎత్తిపోతలకు నీరందించే ఏదుల-డిండి పథకానికి రూ.1800కోట్లతో తమ ప్రభుత్వం టెండర్లు పిలిచి, పనులు చేపడుతోందన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అవసరమైన ఎత్తిపోతల పథకాలన్నింటికీ నిధులు మంజూరు చేసి పనులు చేపడతామన్నారు. మంత్రి వెంకటరెడ్డి అయిదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారని, మరో పర్యాయం ఎంపీగానూ పనిచేశారన్నారు. ఆయన నల్లగొండ అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రూ.700కోట్లతో రింగ్‌రోడ్డు, లతీఫ్‌సాబ్ గుట్ట, బ్రహ్మంగారి గుట్టలపైకి ఘాట్‌రోడ్లు, రోప్‌వేల నిర్మాణాల పనులు శరవేగంగా సాగుతుండడం గమనించానని తెలిపారు. మంత్రి వెంకటరెడ్డి కోరిక మేరకు ఏఎమ్మార్పీ హైలెవల్ కాల్వ లైనింగ్ ప్రాజెక్టుకు రూ.442 కోట్ల నిధులు మంజూరుచేశామని, త్వరలో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. గుండ్లపల్లి-ఉదయసముద్రం పథకానికి రూ.92 కోట్లు, భీమసముద్రం-చర్లపల్లి - మిగతా 7వ పేజీలో...



నల్లగొండ కలెక్టరేట్‌లో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఉమ్మడి జిల్లా సస్యశ్యామలమే లక్ష్యం

- 80 ఏళ్ల కల డిండి ఎత్తిపోతల ద్వారా నెరవేరుతుంది : ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నాం : మంత్రి వెంకటరెడ్డి
- నల్లగొండ నియోజకవర్గంలో రూ.36 కోట్లతో మూడు లిఫ్టులకు శంకుస్థాపన
- కలెక్టరేట్ వద్ద బహిరంగసభ
- తరలివచ్చిన ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

నల్లగొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసే అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను ఈ నాలుగేళ్లలోనే పూర్తిచేసి తీరుతామని నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో రూ.46.25 కోట్ల అంచనావ్యయంతో చేపడుతున్న బక్కతాయికుంట, పానుగోడు, నర్సింగ్‌భట్ల ఎత్తిపోతల పథకాలకు, రూ.36కోట్ల అంచనావ్యయంతో నిర్మించతలపెట్టిన కలెక్టరేట్ అదనపు బ్లాక్ నిర్మాణానికి సోమవారం రోడ్లు, భవనాలశాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో - మిగతా 7వ పేజీలో...


భారీ ప్రదర్శనగా మంత్రుల ర్యాలీ

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనల నిమిత్తం జిల్లాకేంద్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటన నేపథ్యంలో సోమవారం కాంగ్రెస్ శ్రేణులు నల్లగొండ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. కార్లతోపాటు, బైక్‌లతో ఈ ర్యాలీలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. మంత్రులిద్దరూ ఓపెన్‌టాప్ కారులో నిలబడి కార్యకర్తలకు అభివాదం చేస్తూ ఉత్సాహపరుస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. జైకాంగ్రెస్, జై కోమటిరెడ్డి నినాదాలతో ర్యాలీలో కార్యకర్తలు సందడి చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నాయకులు లక్ష్మయ్య, అబ్బగోని రమేష్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లాకేంద్రంలో ర్యాలీలో పాల్గొన్న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

అర్థం లేకుండా మాట్లాడుతున్నారు : మంత్రి కోమటిరెడ్డి



తాము తల్చుకుంటే వరంగల్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన సభకంటే నాలుగురెట్ల సభను నల్లగొండలో పెట్టగలమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ అర్థం లేకుండా మాట్లాడుతున్నారని, మేం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో దాదాపు అయిదునెలలు ఎన్నికల కోడ్ వచ్చిందని, మిగిలిన 11 నెలల్లోనే తాము ఇన్ని పను లు చేసినందుకు ఓర్వలేకపోతున్నారని దుయ్యబట్టారు. నల్లగొండ జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. రహదారులు, సాగునీటి ప్రాజెక్టుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. ఉమ్మడిజిల్లాలో రూ.1600కోట్లతో ఇప్పటికే రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరుచేశామన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను బీఆర్ఎస్ పదేళ్లలో పడావు పెట్టిందన్నారు. మళ్లీ కాంగ్రెస్ వచ్చాకే ఈ పథకం పనులు ప్రారంభమయ్యాక.. - మిగతా 7వ పేజీలో...

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. సోమవారం పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో భాగంగా వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన అర్జీదారుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎవరైనా చట్ట వ్యతిరేకమైనా చర్యలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఫిర్యాదుదారులకు భరోసా, నమ్మకం కలిగించినప్పుడే పోలీస్‌శాఖపై విశ్వాసం ఉంటుందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి దరఖాస్తులు స్వీకరించాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. అంతకుముందే జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 28మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలను అందజేయాలన్నారు.

వరి పరిశోధనలో ముందడుగు

- ప్రైవేటుకు దీటుగా మార్కెట్లోకి నూతన వంగడాలు
- అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రంతో సంయుక్తంగా..
- కంపాసాగర్ పరిశోధన కేంద్రంలో 42వంగడాలపై



వరి పరిశోధనా స్థానం

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పరిధిలోని ఆయకట్టు దశాబ్దాలుగా వరి సాగుకు ప్రసిద్ధి. ఈ ప్రాంతానికి నూతన, అత్యున్నత వంగడాలు అందించాలని అప్పటి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. త్రిపురారం మండలం కంపసాగర్ గ్రామ పరిధిలో 2005లో వ్యవసాయ పరిశోధనా స్థానంను ఏర్పాటు చేసింది. నాణ్యమైన విత్తనాల ఉత్పత్తితో పాటు వివిధ వరి వంగడాల రూపకల్పన, ఆధునిక పద్ధతిలో వరిసాగు లక్ష్యంగా ఈ సంస్థ పని చేస్తోంది.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ వ్యవసాయం)

వ్యవసాయ పరిశోధనా సంస్థ మొత్తం 305 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. కేవీకేతోపాటు సాగు నీటి కాల్వలు, పాలన కార్యాలయాలు వివిధ ప్రజా అవసరాలకు పోను సుమారు వంద ఎకరాల్లో విత్తనాభివృద్ధి, నూతన వంగడాలపై పరిశోధనలు సాగుతున్నాయి. ఫిలిప్పిన్స్ దేశంలో ఉన్న అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కంపసాగర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో స్వల్పకాలిక, దొడ్డు గింజ రకాల్లో నూతన వరి వంగడాల రూప కల్పనకు మూడేళ్ల సంయుక్తంగా పరిశోధనలు సాగిస్తున్నాయి. మొత్తం 42వరి రకాలపై విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి.

కొత్త వంగడాలు....

కేపీఎస్-6251 అనే కొత్త రకం మినికిట్ దశ పూర్తి చేసుకుంది. ఇది సన్నగింజ రకం, పంట కాలం-115 రోజులు చౌడును తట్టుకుని ఎకరానికి 45 బస్తాల వరకు దిగుబడి ఇస్తుంది. ఖరీఫ్, రబీ కాలాలకు అనువైంది. దోమ పోటు, అగ్గితెగులు తట్టుకునే స్వల్పకాలిక సన్న గింజ రకం. సన్న గింజగా ఐకేపీ కేంద్రాల్లో విక్రయించవచ్చు. ప్రభుత్వ బోనస్ పొందే రకం.

- కేపీఎస్-10631, కేపీఎస్-10642 సన్నరకం (పచ్చి ధాన్యం విక్రయానికి అనుకూలం)
- కేపీఎస్-10329 దొడ్డు రకం వరి, పంట కాలం 120 రోజులు, 45-50 బస్తాల దిగుబడి వస్తుంది. ఏడాదిలో మార్కెట్లోకి విడుదలైంది.
- కోసిన ధాన్యం పచ్చిగా ఉన్నప్పుడే నేరుగా (పచ్చిగా)విక్రయించే రకాలున్నాయి. అన్ని రకాల తెగుళ్ల, మంచి దిగుబడులు వచ్చే వంగడాలు విడుదల చేయడానికి పరిశోధనా స్థానంలో ప్రణాళికలు సిద్ధం చేశారు.

నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి...

పరిశోధనా సంస్థ ప్రారంభంనుంచే బీపీటీ-5204, కెన్ఎమ్, జేజీఎల్‌వంటి రకాలను విత్తనోత్పత్తి చేసి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేస్తున్నారు. పరిశోధనా స్థానంలో ప్రతి ఏటా ఖరీఫ్, రబీ కలిపి సుమారు 4వేల క్వింటాళ్ల వరకు విత్తనోత్పత్తి జరుగుతుంది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ పరిధిలోని వివిధ పరిశోధనా సంస్థల్లో విడుదలయిన నూతన రకాల విత్తనాలు ఇక్కడి రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు.

ఈ ఏడాది: వచ్చే ఖరీఫ్‌కోసం వివిధరకాల వరి వంగడాలు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం... - మిగతా 8వ పేజీలో...

కంపాసాగర్ వరి-1 రూపకల్పన

ఇప్పటికే కంపసాగర్ పరిశోధనా స్థానం నుంచి కంపాసాగర్ వరి (కేపీఎస్-2874) అనే రకం 2021లో వివిధ దశలు పూర్తి చేసుకుని మార్కెట్లోకి వచ్చింది. ఎంటీయూ-1010, ఎన్ఎల్ఆర్-34449 రకాలను అనువంశికత వలన ఈ రకం రూపొందింది. ఈరకం వానా కాలానికి అనువైంది. పంట కాలం 135 నుంచి 140రోజులు, దిగుబడి 32 నుంచి 34 క్వింటాళ్లు వస్తుంది. గింజరకం-మధ్యస్థ సన్నం, వానాకాలానికి అనువైన రకం, సుడిదోమ, అగ్గితెగులును సమర్థవంతంగా తట్టుకుంటుంది. తక్కువ నత్రజనితో (25శాతం తక్కువ) చౌడు నేలల్లోనూ మంచి దిగుబడినిస్తుంది. ఈ రకాన్ని సాగర్ ఆయకట్టుతోపాటు ఉత్తర తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్, కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర నది ప్రాజెక్ట్ పరిధిలో అత్యధికంగా సాగు చేస్తున్నారు.

మామిడీలా

● యాదాద్రి భువనగిరి జిల్లాలో తగ్గిన మామిడి దిగుబడి



మామిడి దిగుబడి జిల్లాలో ఈ సారి గణనీయంగా తగ్గింది. వాతావరణంలో వచ్చిన మార్పులతో పూత కూ డా ఆలస్యంగా వచ్చింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో మామిడిచెట్లకు కాసిన పూత కొంతమేరకు రాలిపోయింది. దీనికి తోడు ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయా యి. ఒకప్పుడు మూడు ఇంచుల వరకు పోసే బోర్లు ఇంచునీరు రావడంలేదు. దీంతో జిల్లాలో పలుప్రాంతాల్లో ఉన్న మామిడి తోటలు ఎండుముఖం పడుతున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షంతో మామిడికాయలు నేలరాలాయి. జిల్లాలోని 17 మండలాల్లోనూ మామిడి తోటలు ఉన్నాయి. అయితే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని తుర్కపల్లి, రాజాపే ట, బొమ్మలరామారం, భువనగిరి, బీబీనగర్ మండలాల్లో అధికంగా మామిడితోట లు ఉన్నాయి. జిల్లాలోని తుర్కపల్లి, రాజపేట, బొమ్మలరామారం, గుం డాల, ఆత్మకూరు(ఎం), తదిత ర మండలాల్లో వడగండ్ల వర్షాలకు చెట్లపై కొమ్మలు, కాయలు లేకుండా రాలిపోయా యి. జిల్లాలో ప్రధానంగా బంగినపల్లి, దసేరి, రసాలు వంటి మామిడి పండ్లను ఎక్కువగా పండిస్తారు. జిల్లా వ్యాప్తంగా 11వేల ఎకరాల్లో మామిడిని సాగు చేస్తున్నా రు. పూతకు రాని ఐదేళ్లలోపు ఉన్న మామిడి చెట్లు మరో 2వేల ఎకరాల వరకు ఉన్నాయి. ప్రతీ సంవత్స రం జిల్లానుంచి దాదాపు 23వేల మెట్రిక్ టన్నుల మామిడి పంట దిగుబడి అవుతుంది. కానీ ఈసారి ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం, నీటి ఎద్ద డి, వర్షాభావ పరిస్థితులుతో 18వేల టన్నుల మామిడి దిగుబడి అయ్యే అవకాశం ఉందని ఉద్యాన అధికారు లు అంచనా వేస్తున్నారు. అయితే ఇటీవల వీచిన గాలి దుమారాలకు చెట్లపై ఉన్న సగం కాయలు రాలిపోయాయి. ఇటు వాతావరణం, అటు కరువు పరిస్థితుల నడుమ మామిడి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. మామిడి తోటలను లీజుకు తీసుకున్న వారు కూడా ఈ సారి తీవ్ర నష్టాల ను చవిచూస్తున్నారు.

తోటల్లో కాయలు అనుకున్నంత సైజులో పండకపోవడం తో వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్లకు సరిగ్గా నీరు లేకపోవడంతో కాయల సైజు బాగా తగ్గింది. మామిడి పండ్లు ఈ సారి జిల్లా ప్రజలు మరింత ప్రియంకానున్నాయి. ఇప్పటికే మార్కెట్లో మామిడిపండ్ల ధరలకు లెక్కలొచ్చాయి. రైతుల వద్ద తక్కువ ధరకు తీసుకుని వ్యాపారులు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో గతం కంటే మామిడి పండ్ల ధరలు పెరిగిపోయాయి.

పోషక విలువలు ఉత్పత్తి కావు

మామిడి కాయలు పరిపక్వానికి రాకముందే కార్బైడ్ ఉపయోగించి మగ్గించిన పండ్లు తినడం ద్వారా తీవ్ర అనారోగ్యం పాలవుతారని వ్యవసాయ శాస్త్రవేత్తలు వెల్లడించారు. పరిపక్వానికి రాని మామిడికాయల్లో పోషక విలువలు ఉత్పత్తి కావు. దీంతో పండ్లు రుచికరంగా కూడా ఉండవు. మామిడి చెట్టుకు పండ్లు పరిపక్వానికి వచ్చిన వెంటనే లెంటిసెల్స్ కన్పిస్తాయి. కాయ తొడిమే దగ్గర పసుపుపచ్చని రంగు ఏర్పడుతుంది. మామిడికాయపై చుక్కలు పెద్దగా వస్తాయని వ్యవసాయశాస్త్రవేత్తలు పే ర్కొంటున్నారు.

మామిడి కాయ పరిమాణం కూడా బాగా పెరుగుతుంది. మామిడి పంటపై పూర్తి అవగాహన ఉన్న రైతులు పక్వానికి వచ్చిన విషయాన్ని గ్రహిస్తారని, కాయ పరిమాణాన్ని గుర్తించి పండ్లు కోస్తారు. పరిపక్వానికి వచ్చిన మామిడికాయలను మగ్గించేందుకు ఆహార సలహా కమిటీ సూచించిన మేరకు ఇథెరెల్ అనే మందును ఉపయోగిస్తే ఎలాంటి రోగాలు రావు. పరిపక్వానికి రాని పండ్లలో చెక్కర శాతం ఉత్పత్తి కాక రుచికరంగా కూడా ఉండవు. పరిపక్వానికి వచ్చిన మామిడి కాయను ఒక చోట చేర్చి, ఇథెరెల్ 200 పీపీఎం వరకు కాయలపై పిచికారీ కాని, కుప్పల్లో ఒక మూలన గిన్నెలో పెడితే పండ్లు మగ్గుతాయి. కార్బైడ్ ఉపయోగించిన పండ్లను తిం టే వాంతులు, విరేచనాలు, చర్మ, గొంతు, జలుబు, ముక్కు, కళ్లకు సంబంధించిన వ్యాధులు సంక్రమిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతేకాకుండా అజీర్ణత ప్రభావం కూడా ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కార్బైడ్ ఉపయోగించిన మామిడి పండ్లను తినకూడదని సూచిస్తున్నారు.

పొంచి ఉన్న ముప్పు

మరోవైపు వ్యాపారులు పక్వానికి రాని కాయలను రసాయనాలతో పండ్లుగా మారేలా చేస్తున్నారు. అవి కొనుగోలు చేసి తి న్న వారు మాత్రం రోగాలబారిన పడతారు. దీంతో ఈ మామిడి పండ్ల సీజన్‌లో ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లనుం ది. పరిపక్వంలేని మామిడి కాయల్లో కాల్షియం కార్బయిడ్ ఉపయోగిస్తే వ్యాపారులపై చర్యలు తీసుకోనున్నట్లు ఉత్వర్వులు జారీచేశారు. మార్కెట్ లో పరిపక్వానికి వచ్చిన మామిడి పండ్లను మాత్రమే విక్రయించాలని, లేదంటే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్వర్వులను వ్యాపారులు కచ్చితంగా పాటించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వరంగల్‌లో నిర్వహించిన రజతోత్సవ సభ విజయవంతమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం దేవరకొండలో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజతోత్సవ సభను అడ్డుకోవాలని కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. సభా స్థలానికి వెళ్లనివ్వకుండా ట్రాఫిక్ జాం చేసి వందలాది వాహనాలను తిప్పి పంపినా, ప్రజలు స్వచ్ఛందంగా వచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంఖాయమన్నారు. సమావేశంలో గాజుల ఆంజనేయులు, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, నీల రవికుమార్, వేములరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమూల మార్పులు



బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం, వేదికపై మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

- ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం
- విద్యయే బలమైన ఆయుధం

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే సమాజంలో సమూల మార్పులు చోటు చేసుకుంటాయని ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని గడియారం చౌరస్తాలో పూలే, అంబేడ్కర్ జన జాతర బహిరంగసభను సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆలోచనలే ఈ దేశంలోని బలహీన వర్గాలకు బలమైన ఆయుధాలని, వాటి ద్వారానే సమానత్వం సాధ్యమన్నారు. దేశంలో బ్రాహ్మణ ఆధిపత్య వర్గాలు అంతరాలు సృష్టిస్తూ లబ్ధి పొందుతున్నాయని, ఈ వ్యవస్థను అర్థం చేసుకోలేనంత కాలం మనం మనుగడ సాధించలేమన్నారు. అంబేడ్కర్, పూలే మహనీయులు ఈ దేశ చరిత్రలో నిలిచిపోయారంటే, అందుకు కారణం చదువేనని, విద్యతోనే భవిష్యత్ ఉంటుందన్నారు. విద్య లేకపోతే వివేకం లేదు, వివేకం లేకపోతే చైతన్యం... - మిగతా 8వ పేజీలో...

పిడుగుపాటుతో జాగ్రత్త

● వేసవిలో అకాల వర్షాలు ● అప్రమత్తతే ఆయుధం



'అప్రమత్తంగా ఉండండి.. రాబోయే 30నుంచి40 నిమిషాల్లో మీ మండలంలోని పరిసర ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశముంది. జాగ్రత్తగా ఉండండి. ఏప్రిల్ నెలలో అకాల వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి' అని సూర్యాపేట కలెక్టర్ కార్యాలయానికి సమాచారం అందింది. అప్రమత్తంగా ఉండాలని అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయాలకు, మండలంలోని గ్రామపంచాయతీ కార్యదర్శులకు సమాచారం చేరింది. సూచించినట్లుగానే మండలంలోని మూడు గ్రామాల్లో చెట్ల మీద పిడుగులు పడ్డాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇదీ ఇటీవల జరిగిన కోదాడ మండలంలో జరిగిన ఘటన.

● ఆంధ్రజ్యోతి కోదాడ రూరల్

వానాకాలంలో ముఖ్యంగా తొలకరి వర్షాలు ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు సహజమైన విషయం. ఉరుములు, మెరుపులతో పాటు వచ్చి పడే పిడుగులు మాత్రం ప్రాణాంతకరమే. పొలాల్లో తిరిగే మనుషులు, చినుకుల నుంచి రక్షణ కోసం చెట్ల కిందికి చేరి పిడుగుపాటుకు గురవుతారు. ఒక్కోసారి ఆరుబయట ఉన్న వారు, పశువులతో పాటు, ఇళ్లలో ఉన్న వారు కూడా పిడుగుపాటుకు గురవుతుంటారు. ఊహించకుండా వచ్చిపడే ఉత్పాతంతో రాష్ట్రంలో ప్రతి ఏడాదీ పిడుగుపాటుతో మృతిచెందే వారి సంఖ్య పెరుగుతోంది. దీనిని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో)తో కలిసి పిడుగుపాటుకు సంబంధించి ముందస్తు హెచ్చరికల వ్యవస్థను నెలకొల్పింది. రెవెన్యూ శాఖలోని విపత్తు నివారణా విభాగం ఈ హెచ్చరికల వ్యవస్థను నిర్వహిస్తోంది.

● సాధారణ పిడుగులో 30వేల యాంపియర్లు, 30 కోట్ల ఓల్టుల విద్యుత్తు ఉంటుంది. మన ఇళ్లలో ప్రవహించే విద్యుత్ 220 ఓల్టులు, 5 నుంచి 15 యాంపియర్ల కరెంటుతో ఉంటుంది. అంటేపిడుగు 10లక్షల నుంచి కోటి రెట్లు ప్రమాదకరం. మెరుపు లేదా పిడుగుపాటు వేగం సెకనుకు 60 కిలో మీటర్లకు పైగా ఉంటుంది. అంటే అడ్డంకులు ఏమీ లేకుండా ఉంటే 30కిలో మీటర్ల దూరంలో మెరుపు మీ వద్దకు రావడానికి అరసెకను చాలు. అందుకే పిడుగుపాటు హెచ్చరికలను తేలికగా తీసుకోవద్దని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

● వాతావరణానికి సంబంధించిన ముందస్తు సమాచారం కేవలం అధికారులకే కాకుండా ఆసక్తిగల సాధారణ పౌరులందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు రెండు మొబైల్ యాప్‌లను ఉచితంగా అందుబాటులో ఉంచారు. వాతావరణ సమాచారం కోసం టీజీ వెదర్ ఫోర్‌కాస్ట్ అనే యాప్, పిడుగుపాటుపై ముందస్తు సమాచారం కోసం వజ్రపత్ అనే యాప్‌ను సిద్ధం చేశారు. ఫోన్ ద్వారా మీరున్న ప్రదేశాన్ని గుర్తించి, దానికి సమీపంలో పిడుగుపడే అవకాశాలను తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఈ హెచ్చరికల వ్యవస్థ ద్వారా బీఎస్ఎన్ఎల్ మొబైల్ నెట్‌వర్క్ పరిధిలోని వినియోగదారులకు కూడా పిడుగుపాటుకు సంబంధించిన సంక్షిప్త సందేశాలు పంపుతున్నారు.

పిడుగు.. కొన్ని నిజాలు

● ఎక్కడైనా పిడుగు పడొచ్చు. కానీ సాధారణంగా ఎత్తైన చెట్లు లేదా భవనాలను తాకుతుంది. కనుక తక్కువ ఎత్తైన ప్రదేశాలు కొంత సురక్షితం.

● వర్షానికి ముందు, తర్వాత కూడా పడొచ్చు. భారీ వర్షం కురుస్తున్న ప్రాంతానికి 16కిలో మీటర్ల దూరం వరకూ పిడుగు పడే అవకాశముంది.

● పిడుగు పడి మృతిచెందిన వారు ఎక్కువ మంది ఆరుబయట ఉన్నవారే. ఏదైనా మానవ నిర్మిత కప్పు కింద ఉన్నప్పుడు పిడుగుపాటు అవకాశం బాగా తగ్గుతుంది. ఒకేచోట అనేకసార్లు పిడుగు పడొచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



● ఇంట్లో ఉంటే కిటికీలు, తలుపులు మూసివేయాలి.

● కిటికీ ఊచలకు, పిట్టగోడలకు, లోహపు నిర్మాణ భాగాలకు దూరంగా ఉండాలి.

● ఆఖరి ఉరుము వినబడిన అరగంట వరకు బయటకు రావొద్దు.

● బయట ఉంటే బలంగా ఉన్న మానవ నిర్మాణం కిందకు వెళ్లాలి.

● ఒంటరిగా, పొడవుగా ఉన్న చెట్ల కిందకు వెళ్లకూడదు.

● ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు, వ్యవసాయ పనిముట్లకు దూరంగా ఉండాలి.

● పిడుగులు పడే ప్రమాముంటే ద్విచక్రవాహనం మీద ప్రయాణిస్తుంటే వెంటనే ప్రమాదరహిత ప్రదేశానికి చేరుకోవాలి.

● ఖాళీగా విశాలంగా ఉన్న మైదానంలో ఉంటే చెవులలో వేళ్లు పెట్టుకుని మూసుకొని, మోకాళ్లలో తలపెట్టుకుని నేల మీద కూర్చోవాలి.

● పిడుగు తాకిన వ్యక్తిని ముట్టుకోవచ్చు. తక్షణ వైద్య సహాయానికి తరలించవచ్చు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

● ముగ్గురు బాలలు ● ఆరుగురు మహిళలపై దాడి

కోదాడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో ముగ్గురు చిన్నారులు, ఆరుగురు మహిళలు గాయపడ్డారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని గణేష్‌నగర్‌లో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కోదాడ పట్టణంలోని 18వ వార్డులో ఓ చిన్నారి ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్క కరిచింది. చిన్నారి కేకలు వేయడంతో తల్లిదండ్రులు వచ్చి కుక్కను తరిమారు. అంతకుముందు అదే కుక్క కాలనీలోని మరో ఇద్దరు చిన్నారులను, ఆరుగురు మహిళలను గాయపర్చింది. గాయపడిన చిన్నారులతో పాటు మహిళలను వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. మున్సిపల్ సిబ్బంది, అధికారులు వీధి కుక్కల బారి నుంచి కాలనీవాసులను రక్షించాలని మాజీ కౌన్సిలర్ ఉప్పగండ్ల సరోజ శ్రీనివాస్ కోరారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్

చింతపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలకేంద్రంలోని వెంటసాయి రైస్‌మిల్లును సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. తూకాల్లో మోసం చేయకుండా పారదర్శకంగా ఉండి డబ్బులు చెల్లించాలని మిల్లర్లకు సూచించారు. ఆయనవెంట ఆర్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుల నియామకం

నల్లగొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గ్రామ, మండల కమిటీలతో అనుబంధ కమిటీల ఎన్నికల కోసం నియోజకవర్గాల వారీగా పరిశీలకులను నియమించినట్లు పార్లమెంటు కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మే 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు కమిటీలను మొత్తం పూర్తి చేయాలని కోరారు. నల్లగొండ నియోజకవర్గానికి తుమ్మల మధుసూదన్‌రెడ్డి, దేవరకొండకు నియోజకవర్గానికి ముప్ప అరుణకుమార్, మిర్యాలగూడకు మండవ వెంకటేశ్వర్‌గౌడ్, నాగార్జునసాగర్‌కు వస్కుల కృష్ణయ్య, హుజూర్‌నగర్ నాతాల రాంరెడ్డి, కోదాడకు కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, సూర్యాపేటకు ఎల్వీ యాదవ్‌ను నియమించారు.

ఆరోగ్యం.. సుఫలం

సమ్మర్ కేర్ summer care

» ప్రకృతి ప్రసాదించే పండ్లతో ఆరోగ్యానికి మేలు
» శరీర ఎదుగుదలకు దోహదం
» ఎండ వేడిమికి పండ్లతో ఉపశమనం
» అందుబాటులో రకరకాల పండ్లు



ప్రకృతి ప్రసాదించే పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరానికి కావాల్సిన సత్తువను, రోగ నిరోధక శక్తిని పెంచే గుణం పండ్లకు ఎంతో ఉంటుంది. పండ్లలో పలు విటమిన్లతో పాటు ఎన్నో విలువైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ప్రతిరోజూ ఒక పండు తింటే ఆరోగ్యం ఎంతో పదిలంగా ఉంటుంది. నిత్యం పండ్లు తినేవారికి ఆరోగ్యం విషయంలో మందులతో పని ఉండదు, ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం కూడా రాదు. నిత్యం మార్కెట్లో ఎన్నో రకాల పండ్లు మనకు లభిస్తాయి.

- (ఆంధ్రజ్యోతి - నిడమనూరు)

అరటి, ద్రాక్ష, ఆపిల్, దానిమ్మ వంటి తదితర రకాల పండ్లు అన్ని సీజన్లలో లభిస్తాయి. మామిడి, సపోట, సీతాఫలం, బత్తాయి, జామ వంటి రకాల పండ్లు మాత్రం సీజన్‌లో దొరుకుతాయి. ఏ కాలంలో లభించే పండ్లు ఆ కాలంలో తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకుందాం..

పండ్ల రసాలు ఆమ్లాలు కలిగి ఉంటాయి. అవి తీసుకోవడం వలన వివిధ రోగాలు నయమవుతాయి. ఆమ్ల గుణం కలిగిన పండ్ల రసాలు సేవించడంతో అవి మన శరీరంలోని విష పదార్థాలను బయటికి పంపుతాయి. పండ్ల రసాలు కడుపులో క్రిములు లేకుండా చేసి అన్నవాహికను శుభ్రపరుస్తాయి. దీంతో పలు రోగాలు నివారిస్తాయి. వేసవికాలంలో మండుతున్న ఎండలకు జనం తల్లడిల్లిపోతున్నారు. ఎండలో తిరిగితే వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానియాలు, కొబ్బరి బొండాలు, పండ్ల రసాలు సేవిస్తున్నారు. వేసవిలో కర్బుజా, సపోట, వాటర్‌మిలన్, పైనాపిల్, మామిడి వంటి తదితర పండ్ల రసాలు సేవించడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. క్యారెట్, బీట్‌రూట్, కీర కూడా వేసవిలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. పలు రకాల పండ్లు ఆరోగ్యం విషయంలో కింది విధంగా దోహదం చేస్తాయి.

ఆరెంజ్‌తో ఆరోగ్యం...




మార్కెట్‌లో ఆరెంజ్ పండ్లు పుష్కలంగా లభిస్తున్నాయి. వీటిని తినడంతో పాటు రసం కూడా తాగితే శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. విటమిన్ సీతో పాటు రోగ నిరోధక శక్తిని పెంచే గుణం కూడా ఈ పండ్లకు ఉంటుంది.

కర్బూజతో ఎంతో మేలు...



కర్బూజ వినియోగం ఎండాకాలంలో ఎక్కువగా ఉంటుంది. ఎండలో తిరిగేవారు వీటిని తీసుకుంటే శరీరంలో నీటి శాతం పెరిగి తగిన గ్లూకోజ్ అందుతుంది. కర్బూజతో వడదెబ్బ నుంచి కాపాడుకోవచ్చు. చర్మానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. శరీర కాంతిని పెంచుతుంది.

ద్రాక్షతో ఎంతో ఉపయోగం..




తియ్యటి ద్రాక్ష పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. రక్త వృద్ధిని పెంచుతాయి. వేసవిలో ద్రాక్ష రసం తాగితే ఎండల నుంచి వెంటనే ఉపశమనం కలుగుతుంది. ద్రాక్షలో ఎన్నో విలువైన విటమిన్లు, పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి అన్ని కాలాల్లో విరివిగా లభిస్తాయి.

మామిడి ఎంతో మధురం




అన్ని పండ్లల్లో రారాజు మామిడి అని చెప్పవచ్చు. ఇది వేసవి సీజన్‌లో మాత్రమే లభిస్తుంది. మామిడి పండు రుచి ఎంతో మధురంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఈ పండును ఎంతగానో ఇష్టపడతారు. మామిడిపండ్లలో విలువైన పోషకాలు ఉంటాయి. మ్యాంగో జ్యూస్ తాగేందుకు కూడా ఎక్కువ మంది ఎంతగానో ఇష్టపడతారు. నోరూరించే రకరకాల మామిడి పండ్లు అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా మార్కెట్లో అందుబాటులో ఉన్న వివిధ రకాల ఫలాలు ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయి.

వేసవిలో పుచ్చకాయలతో మేలు...



వేసవి సీజన్ కావడంతో మార్కెట్లోకి పుచ్చకాయలు జోరుగా వస్తుంటాయి. చవకగా కూడా లభిస్తుంటాయి. ఎండల నుంచి పుచ్చకాయలు శరీరాన్ని కాపాడుతాయి. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. రోగ నిరోధక శక్తిని కూడా అందించే గుణం కలిగి ఉంటుంది. ఒంట్లో నీరసాన్ని కూడా తగ్గిస్తుంది. వడదెబ్బ తగలకుండా కాపాడుతుంది. ప్రతి ఒక్కరూ ఇష్టంగా తింటారు.

అరటితో అనేక లాభాలు



అరటి పండ్లు అన్ని కాలాల్లో లభిస్థాయి. ఈ పండును ప్రతి ఒక్క రూ ఎంతో ఇష్టంగా తీసుకుంటారు. అరటిపండు లో గ్లూకోజ్ ఎక్కువగా ఉంటుంది. అరటిలో ఎన్నో విలువైన పోషకాలు పుష్కలంగా ఉంటా యి. పెరుగన్నంలో అరటి పండు తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. పిల్లల శరీ ర ఎదుగుదలకు కూడా అరటి పండు ఎంతో దోహదం చేస్తుంది. గతంలో అరటిపండ్లను డజన్ల చొప్పున విక్రయించేవారు. ప్రస్తుతం వీటిని కూడా తూకంలో అమ్ముతున్నారు.

వైటీపీఎస్‌లో అగ్ని ప్రమాదం

● మంటలు అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది ● లక్షల్లో ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం


పరిశ్రమలోని యూనిట్-1లో ఎగిసిపడుతున్న మంటలు

దామరచర్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులో నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ(వైటీపీఎస్) లోని యూనిట్-1లో ఆదివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పరిశ్రమలోని యూనిట్-2ను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించగా, యూనిట్-1ను ఈ ఏడాది మే నెలలో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1లో నిరంతరం విద్యుత్ ఉత్పత్తి జరిగేందుకు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. బాయిలర్‌కు ఆయిల్ సరఫరా అవుతున్న క్రమంలో పైపులైన్‌కు ఏర్పాటు చేసిన గ్యాస్ కట్ వద్ద లీకేజీ జరిగింది. అట్టి లీకేజ్ అయిన ఆయిల్ దిగువన ఉన్న వేడి మెటీరియల్‌పై పడడంతో ఒక్కసారిగా మంటలు లేచాయి. దీంతో అప్రమత్తమైన ఉద్యోగులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు 30మీటర్ల ఎత్తులోని కేబుల్, కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతిన్నట్లు సమాచారం. ఆదివారం సెలవు దినం కావడంతో సంఘటన జరిగిన ప్రాంతంలో కార్మికులు పెద్ద సంఖ్యలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనతో లక్షల్లో ఆస్తినష్టం జరిగినట్లు సమాచారం. ఈ ప్రమాదం సంభవించడంతో ట్రయల్ రన్ పనులు పూర్తయ్యేందుకు మరింత సమయం పట్టనుంది. ఈ విషయమై పరిశ్రమలోని అధికారులకు సంప్రదించగా ట్రయల్ రన్ చేస్తున్న క్రమంలో ఇలాంటి ఘటనలు సాధారణంగా జరుగుతాయని వెంటనే మంటలను అదుపులోకి తీసుకొచ్చామని వారు చెప్పుకొచ్చారు. పరిశ్రమలోని యూనిట్-1లో అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

ప్రమాదంపై అధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష

యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో యూనిట్-1 పనుల్లో ఆయిల్ లీకేజీతో అగ్ని ప్రమాదం సంభవించిన నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా, బీహెచ్ఈఎల్ సీఎండీ సదాశివమూర్తిలతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెన్‌కో, బీహెచ్ఈఎల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదానికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో యూనిట్-1లోని పనులు పునఃప్రారంభించాలని ఆయన అధికారులకు సూచించినట్లు జెన్‌కో చీఫ్ ఇంజనీర్ సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

మఠంపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మంచ్యాతండా గ్రామపంచాయతీలో పనిచేస్తున్న ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మాలోతు రవిని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సస్పెండ్ చేశారు. మండల ఏపీవో ఉమా, టీఏ నర్సింహకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ రవి మస్టర్లలో సంతకాలు ఫోర్జరీ చేస్తున్నారన్న ఆరోపణలపై తండాకు చెందిన కొందరు నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేసిన మండల అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. మస్టర్లలో ఫోర్జరీ సంతకాలపై కలెక్టర్ ఏఫ్ఏను విధుల నుంచి తొలగిస్తూ ఏపీవో, టీఏలకు షోకాజ్ జారీ చేశారు. ఈ విషయమై ఎంపీడీవోకు జగదీశ్‌కుమార్ సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఉపాధిహామీ మండల ఏపీవో ఉమాను వివరణ కోరగా ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.

బస్సు ఫుట్‌బోర్డు నుంచి జారిపడి గాయాలు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బస్సు ఫుట్‌బోర్డు నుంచి జారిపడి యువకుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండ కేంద్రంలో సోమవారం జరిగింది. మండలంలోని బాదెకుంట గ్రామానికి చెందిన ఎల్క మల్లేష్ అనే యువకుడు సొంత పనుల నిమిత్తం నార్కట్‌పల్లికి వచ్చి తిరిగి స్వగ్రామంకు వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. బస్సులో ఎక్కువ మంది ప్రయాణికులు ఉండడంతో ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

కనగల్, అడ్డగూడూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని జీఎడవల్లి గ్రామశివారు వ్యవసాయ భూముల్లో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి రైతు కర్నాటి గిరికి చెందిన సూడి గేదె సోమవారం మృతిచెందింది. విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. పశువైద్యాధికారి బాబు పంచనామా నిర్వహించారు. గేదె ఖరీదు సుమారు రూ.80వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. అదే విధంగా యాద్రాది భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన రైతు మద్ది ధనంజయ్ కు చెందిన గేదె మేత మేస్తూ నీటీ కొరత మూసీ వాగులోకి వెళ్లింది. వాగులో బోరు మైటారు విద్యుత్ సరఫరా కోసం వేసుకున్న విద్యుత్ తీగలు తగలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

శాలిగౌరారం ప్రాజెక్టును నల్లగొండ జిల్లా పరిధిలోకి తెస్తాం

● ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


పలివాడ గ్రామ సమీపంలోని శాలిగౌరారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వీరేశం, సామేలు

శాలిగౌరారం, రామన్నపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నీటి పారుదల శాఖ పరిధిలో ఉన్న శాలిగౌరారం ప్రాజెక్టును నల్లగొండ జిల్లా నీటి పారుదల శాఖలోకి తెచ్చేందుకు కృషి చేస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించిన ఫీడర్ ఛానల్‌ను రామన్నపేట మండలం మూసీ నది సమీపంలోని పల్లివాడ హెడ్ వర్క్స్‌ను, సూరారం, తుర్కపల్లి గ్రామ సమీపంలోని హెడ్‌వర్క్స్ షట్టర్లను, శాలిగౌరారం ప్రాజెక్టును ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్‌లతో కలిసి సోమవారం పరిశీలించారు. మూసీనది నుంచి వరద నీరు ఉధృతంగా వస్తున్నా ఫీడర్ ఛానల్ ద్వారా ప్రాజెక్టులోకి ఎందుకు సక్రమంగా వెళ్లడం లేదని అధికారులను ప్రశ్నించారు. షట్టర్లు, కాల్వ అధ్వానంగా ఉన్నా ఎందుకు పట్టించుకోవడం లేదని అధికారులను నిలదీశారు. శాలిగౌరారం ఫీడర్ ఛానల్ పరిధిలో ఉన్న హెడ్ వర్క్స్ షటర్లకు, రామాంజపురం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి, ప్రాజెక్టు కట్ట అభివృద్ధికి నాలుగేళ్ల క్రితం మిషన్‌కాకతీయ కింద రూ.5.10కోట్లు మంజూరయ్యాయని, అందులో కేవలం రూ.2.10కోట్ల పనులు జరిగాయని, మిగిలిన రూ.3కోట్ల పనులను 15 రోజుల్లోపు కాంట్రాక్టర్‌తో పూర్తి చేయించాలని ఆదేశించారు. ప్రాజెక్టు అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న బిల్లు కోసం సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతానన్నారు. కార్యక్రమంలో ఐబీ ఈఈ జెల్లా సత్యనారాయణ, డీఈ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకుడు నూక కిరణ్‌కుమార్ యాదవ్, మార్కెట్ ఛైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ నరిగే నర్సింహ, కందాల సమరంరెడ్డి, అన్నెబోయిన సుధాకర్, గూని వెంకటయ్య, సింగిల్ విండో వైస్ ఛైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, వేముల గోపినాథ్, చామల వెంకటరంగారెడ్డి, చాడ రమేష్ చందర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి..

మునుగోడు రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని కల్వలపల్లి గ్రామంలో సోమవారం వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. ఎస్ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం కరటంపాడు గ్రామానికి చెందిన పత్తిపాటి హజరత్(40) తాపీమేస్త్రీగా పని చేసేవాడు. 18సంవత్సరాల క్రితం మును గోడు మండలం కల్వలపల్లి గ్రామానికి చెం దిన కంభంపాటి లక్ష్మమ్మతో అతనికి వివాహమైంది. అప్పటి నుంచి కల్వలపల్లి గ్రామంలోనే ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవ డంతో కుటుంబ సభ్యులు వెతకగా గ్రామ శివారులోని ముత్యాలమ్మ గుడి సమీపంలో అతని మృతదేహం లభించింది. తన కొడుకు అనుమానాస్పదంగా మృతిచెందాడని తల్లి ఈరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


మూసీ ఆయకట్టులోని ముక్తాపూర్ శివారులో కాంతులీనుతున్న వరి పంట

వరి.. సిరులు !

హైదరాబాద్‌కు చేరువలో ఉన్న యాదాద్రి-భువనగిరి జిల్లాలోని మూసీ ఆయకట్టు పరిధిలో యాసంగి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వరి పంట కోతలకు రావడంతో సోమవారం సాయంత్రం సూర్యుడి కాంతులు వరి చేలపై పడి సువర్ణ శోభితమై చూపరులను వరి.. సిరిలాగా కనువిందు చేస్తోంది. మూసీ ఆయకట్టులో ఎటు చూసినా .. వరి చేలు హరితవర్ణంలో కనుచూపు మేరలో విస్తరించింది. వరి పైర్లతో మూసీ పరివాహకం చూపరులను కనువిందు చేస్తోంది. యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని వరి చేలు ప్రజలను ఆకట్టుకుంటున్న దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' సోమవారం క్లిక్ మనిపించింది.

● ఆంధ్రజ్యోతి, భూదాన్‌పోచంపల్లి

ఉమ్మడిజిల్లా సస్యశ్యామలమే లక్ష్యం

(5వపేజీ తరువాయి)

కలిసి శంకుస్థాపన చేశారు. మంత్రుల పర్యటన సందర్భంగా నల్లగొండలో మంత్రులతో కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రులిద్దరూ ఓపెన్‌టాప్ కారులో నిలబడి ర్యాలీలో పాల్గొని కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఇదే సభావేదికనుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ జిల్లాలో అయిదుగురు లబ్దిదారులకు సోమవారం రూ.లక్ష విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమాల్లో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్‌రెడ్డి, మందుల సామేల్, బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ శరత్ చంద్రపవార్, అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, రాజ్‌కుమార్, ప్రాజెక్టుల సీఈ అజయ్‌కుమార్, ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి, జవహర్, డీఆర్‌వో అశోక్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణఅధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వంగూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎంపీలు కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ సత్యం, ఎమ్మెల్యేలు వీరేశం, బాలు నాయక్, రాజగోపాల్‌రెడ్డి, సామేలు, బీఎల్ఆర్, జైవీర్‌రెడ్డి

అదనపు బ్లాక్ నిర్మాణంతో ఉద్యోగులకు వెసులుబాటు : కలెక్టర్



ఉద్యోగులు ఇంటి కంటే ఎక్కువ సమయం ఉద్యోగానికే కేటాయిస్తుంటారని, అలాంటివారు పని చేసే చోట వసతులు, సదుపాయాలు బాగుండాలనే సదుద్దేశంతో కలెక్టరేట్‌లో 82వేల చదరపు అడుగుల అదనపు బ్లాక్ నిర్మించేందుకు ప్రభుత్వం ముందుకురావడం అభినందనీయమని, ఇందుకు నిధులు మంజూరు చేసిన మంత్రికి కృతజ్ఞతలు అని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. జిల్లా అభివృద్ధికి, ప్రభుత్వ పథకాల అమలుకు అధికారయంత్రాంగం కృషి చేస్తోందని, ఏసీలలో ఉండకుండా ప్రజాక్షేత్రంలో ఉండి అందరం పనిచేద్దామన్నారు. తాను బాధ్యతలు చేపట్టాక స్వల్పకాలంలోనే బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుకు అవసరమైన 737 ఎకరాల భూ మిని సేకరించామని, ఈప్రాజెక్టుతో 97వేల ఎకరాలకు సాగునీరొస్తుందన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి క్రిటికల్ కేర్‌యూనిట్‌ను నల్లగొండ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఉద్యోగులంతా చిత్తశుద్ధితో పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

జిల్లా అభివృద్ధికి అధికారులంతా సహకరించాలి : ఎంపీ రఘువీర్‌రెడ్డి

జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు, ఉద్యోగులంతా సహకరించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేదల సంక్షేమం కోసం, రాష్ట్ర అభ్యున్నతికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. వాటన్నింటినీ అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారయంత్రాంగం చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లాగా ఉన్న నల్లగొండలో సకలసౌకర్యాలతో కలెక్టరేట్ అదనపు భవనం నిర్మించతలపెట్టడం అభినందనీయం.

జిల్లా ప్రగతికి అందరూ సహకరించాలి : ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

జిల్లాని ప్రగతిపథంలో తీసుకెళ్లేందుకు అందరూ సహకరించాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పథకం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. భూభారతితో రైతుల సమస్యలు తీరుతున్నాయి. ఎమ్మెల్యేలంతా నియోజకవర్గాల్లో పలు సంక్షేమ, అభివృద్ధి పనులు చేపడుతూ జజిల్లాని ప్రగతిపథంలో నడిపిస్తున్నారు. అందరికీ అభినందనలు.

నల్లగొండ నాయకులెవరూ సామాన్యులు కాదు : ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నల్లగొండ జిల్లా కాంగ్రెస్ నేతలంటే సామాన్యులు కాదు. అసాధ్యాలని సుసాధ్యం చేయగల వాళ్లే. క్షేత్రస్థాయిలో బలమున్న నేతలు. నిరంతరం జిల్లా ప్రగతి కోసం మేమంతా తాపత్రయపడుతున్నాం. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి సీఎం స్థాయి వ్యక్తులు, గత ప్రభుత్వంలో మంత్రి కనీసం సీఎం వద్ద మాట్లాడగలిగేవారా.. ఆలోచించాలి. జిల్లా అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. కలెక్టరేట్‌లో అదనపు భవనం నిర్మించడం అభినందనీయం.

డిండి ప్రాజెక్టు వస్తుందని ఊహించలేదు: ఎమ్మెల్యే బాలునాయక్

వెనకబడిన దేవరకొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసే పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేస్తుంది. డిండి ప్రాజెక్టు వస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు. నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలకు నిధులిచ్చారు. అదేవిధంగా ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్‌కార్యాలయాలు, రోడ్ల నిర్మాణాలకు నిధులివ్వాలని కోరుతున్నాం. అందరి సహకారంతో జిల్లాని అగ్రపథాన నిలుపతాం.

సన్నబియ్యం పథకం అమలు సాహసోపేత నిర్ణయం: ఎమ్మెల్యే వీరేశం

రాష్ట్రంలో సన్నబియ్యం పథకం అమలు చేయడం దేశంలోనే సాహసోపేత నిర్ణయం. దేశానికే ఆదర్శంగా ఈ పథకం నిలిచింది. ఇదే కాకుండా పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలతో జిల్లాని, తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రపథంలో నడిపేందుకు మంత్రులు కృషి చేస్తున్నారు. నల్లగొండ జిల్లాని గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా అన్నిరంగాల్లో ముందుకెళుతోంది.

అర్థం లేకుండా మాట్లాడొద్దు : మంత్రి కోమటిరెడ్డి

(5వపేజీ తరువాయి)



మంత్రులతో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

కేసీఆర్ కక్కుర్తి పడడంతోనే అక్కడ ప్రమాదం జరిగింది. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు చేసేందుకు అవసరమైన బేరింగ్‌కోసం అమెరికా వెళ్లి ఆర్డర్ ఇచ్చి తెప్పించామన్నారు. ప్రస్తుతం ఆ బేరింగ్‌ను మిషన్‌లో అమరుస్తున్నారు. వారం పదిరోజుల్లో ఒకవైపున పనులు ప్రారంభమవుతాయని, బ్రాహ్మణ వెల్లంల పథకం కింద కాల్వ ల పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. వచ్చే వానాకాలానికి ఆయకట్టుకు నీరందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో ఒక్క నెలలో అయినా ఒకటోతేదీన ఉద్యోగులకు వేతనాలిచ్చిన పరిస్థితి ఉందా..? అని నిలదీశారు. తాము ఉద్యోగులకు, పింఛన్‌దారులకు ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలందిస్తున్నామని తెలిపారు. పేదలకు ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను కట్టించే ప్రక్రియ మొదలైందని, రాజీవ్ యువ వికాసం కింద యువకులకు స్వయం ఉపాధి కింద రూ.5లక్షలు ఇస్తామని, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు ఇస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూసీ కాల్వలకు, ఎత్తిపోతల పథకాలకు, గంధమళ్ల రిజర్వాయర్‌ను చేపట్టి పూర్తిచేస్తామన్నారు. కలెక్టరేట్ భవనాన్ని అన్ని హంగులతో అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో రూ. 35కోట్లతో అదనపు బ్లాక్‌ని నిర్మిస్తున్నామని చెప్పారు.

నాలుగేళ్లలో ప్రాజెక్టులను పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్

(5వపేజీ తరువాయి)

ప్రాజెక్టుకు రూ.26కోట్ల నిధులతో ప్రతిపాదనలు అందాయని, వాటిని కూడా మంజూరుచేస్తామని ప్రకటించారు. బునాదిగానికాల్వ, పిలాయిపల్లి కాల్వ, ధర్మారెడ్డిపల్లి కాల్వలకు రూ.500కోట్లతో నిధులు మంజూరు చేయగా, పనులు మొదలయ్యాయని, ఎమ్మెల్యేలు రోజూ పనులు పర్యవేక్షించి సకాలంలో పూర్తయ్యేలా సమీక్షలు చేయాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. రైతులంతా ప్రాజెక్టులు, కాల్వలకు భూసేకరణ విషయంలో సహకరించాలని మంత్రి కోరారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కోరిన మేరకు శివన్నగూడెం నుంచి సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు లిఫ్టు చేపట్టాలనే ప్రతిపాదనలకు నిధులిస్తామని, త్వరలో టెండర్లు చేపడతామని ప్రకటించారు. నకిరేకల్ ఎమ్మెల్యే కోరిక మేరకు అయిటిపాముల ఎత్తిపోతల పథకం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచనమేరకు దున్నపోతుల గండి సహా నాలుగు ఎత్తిపోతల పథకాలను పూర్తిచేస్తామన్నారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి కోరిన ప్రకారం ఎ నెల్లికల్లు ఎత్తిపోతల పథకం మొదటిదశను వేగంగా పూర్తిచేస్తామన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ కోరికమేరకు పెండ్లిపాకల రిజర్వాయర్ పూర్తిచేస్తామని, కాచవరం, చింత్రియాల, రాములోరిబండ లిఫ్టులు పూర్తిచేస్తామని ప్రకటించారు. తుంగుతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు 15 ప్రాజెక్టులకు నిధులివ్వాలని కోరారని, వాటన్నింటినీ ఆమోదించి నిధులిప్పిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా దేవాదుల మూడోదశ నుంచి తుంగతుర్తికి నీళ్లిచ్చే రూ. 1000కోట్ల పథకాన్ని ఆమోదిస్తామన్నారు. బీర్ల అయిలయ్య పేర్కొన్న ప్రకారం గంధమళ్ల రిజర్వాయర్ మంజూరుచేసి పనులు పూర్తిచేయిస్తామన్నారు. అదేవిధంగా ఎంపీ కిరణ్‌రెడ్డి ప్రతిపాదించిన రాచకాల్వ లైనింగ్ చేపడతామని, శాలిగౌరారం కాల్వల లైనింగ్, కేతిరెడ్డిపల్లి కాల్వ లైనింగ్ చేపడతామన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సహకారంతో ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తున్నామని, తాము పదవులు అలంకారం కోసం చేయడం లేదని, మంత్రులుగా బాధ్యతలు తీసుకున్న క్షణం నుంచి ప్రతిరోజూ 24గంటలు కష్టపడి పనిచేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా ప్రగతికి ఎవరు ఏమూల నుంచి వచ్చినా తాము పనులు చేస్తామని, వారి సమస్యలు తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.

రసవత్తరంగా ఎడ్ల పందేలు



ఆరు పండ్ల కేటగిరీ విభాగంలో తలపడుతున్న గిత్తలు

మఠంపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలకేంద్రంలోని శుభవార్త ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్లపందేలు సోమవారం రసవత్తరంగా కొనసాగాయి. మొదటి రోజు శనివారం నిర్వహించిన నాలుగు పండ్ల విభాగంలో నిర్వహించిన బండలాగుడు బల ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి గుంటూరు జిల్లా గిత్తలు సత్తాచాటి ఆరుస్థానాలు 1,3,4,5,6,7 స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఆదివారం జరిగిన ఆరు పండ్ల విభాగంలో ప్రకాశం, గుంటూరు, సూర్యాపేట, నల్లగొండ పల్నాడు, విజయనగరం, బాపట్ల జిల్లాలకు చెందిన 12జతలు పోటీల్లో పాల్గొన్నాయి. ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకొని సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు పోటీలు జరుగుతున్నాయని శుభోదయ యువజన సంఘం గాదె జయభరత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జరిగిన కేటగిరీ విభాగంలో మొత్తం 12జతలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తాగునీరు, వసతి, భోజన సదుపాయాలను కమిటీ సభ్యులు కల్పిస్తున్నారు. పోటీలను తిలకించేందుకు రెండు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రేక్షకులు తరలిరావడంతో పోటీలు నిర్వహిస్తున్న వీవీ మైదానం కోలహలంగా మారింది. కార్యక్రమంలో ఫాదర్ వినోద్‌రెడ్డి, ఆదూరి మధుసూదన్‌రెడ్డి, శౌరెడ్డి, జడ్డు జల బాల్‌రెడ్డి, కె.చిన్నపురెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలశౌరెడ్డి, గాదె పవన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, సిస్టర్ రూబీ, సుజాత, అలంబాల్‌రెడ్డి, అంతోన్‌రెడ్డి, లూర్దురెడ్డి, చర్చి పెద్దలు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పోటీల్లో ఆరు పండ్ల విభాగంలో నిర్వహించిన పోటీల్లో పల్నాడు జిల్లాకు చెందిన ఓసరారెడ్డి గిత్తలు మొదటి బహుమతి, ఆర్‌కే బుల్బుల్ అత్తోటరి కిపా చౌదరి, శివరామకృష్ణచౌదరి గిత్తలు రెండో బహుమతి, బాపట్ల జిల్లాకు చెందిన గొట్టిపాటి రవికుమార్, యాతేచిలుకూరి నాగేశ్వరావు గిత్తలు మూడో బహుమతి, అనంతనేని కాశ్య కృష్ణాజిల్లా నాలుగో బహుమతి, మేక అంజిరెడ్డి గిత్తలు ఐదో బహుమతి, ఖాసీంవలీ ప్రకాశం జిల్లా ఆరో బహుమతి, సూరా పూజితరెడ్డి ప్రకాశం జిల్లా ఏడో బహుమతి, బత్తుల శ్రీనివాస్ ఎనిమిదో బహుమతి, కేఎస్‌రెడ్డి బుల్స్ నలమాద ఉత్తమ్‌పద్మావతిరెడ్డి కోదాడ తెలంగాణ గిత్తలు తొమ్మిదోబహుమతి, పల్నాడు జిల్లాకు చెందిన జాలే హనుమంతరావు గిత్తలు పదో బహుమతి గెలుచుకున్నట్లు యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. విజేతలకు దాతలు, నాయకులు, నిర్వాహకులు షీల్డ్, నగదుతో పాటు శాలువాతో సత్కరించారు.



ఆరు పండ్ల విభాగ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు, నిర్వాహకులు

వ్యవసాయ శాఖ కార్యాలయంలో తప్పిన ప్రమాదం

● పెచ్చులూడిన స్లాబ్ ● భయంతో పరుగులు తీసిన సిబ్బంది



స్లాబ్ పెచ్చులూడి కిందపడిన పెళ్లలు

కోదాడ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడలోని వ్యవసాయ కార్యాలయం స్లాబ్ సోమవారం అకస్మాత్తుగా స్లాబ్ పెచ్చులూడింది. సిబ్బంది విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ విధంగా జరగడంతో భయంతో పరుగులు తీశారు. వ్యవసాయ కార్యాలయం ఇప్పటికే శిథిలావస్థకు చేరింది. సిబ్బంది భయం..భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై కథనాలను 'ఆంధ్రజ్యోతి' ఇప్పటికే ప్రచురించింది. ప్రస్తుతం కోదాడ వ్యవసాయ శాఖ కార్యాలయం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలోని రైతు విశ్రాంతి భవనంలో నిర్వహిస్తున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన గోదాంను ఓ వ్యక్తి ఆక్రమించి దర్జాగా అందులో ఇంటిని నిర్మించుకుని నివసిస్తున్నాడు. వ్యవసాయ శాఖ కార్యాలయం మాత్రం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉందని, ఈ భవనంలో విధులు నిర్వహించాల్సి వస్తోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి కొత్త భవనం నిర్మించాలని, లేనిచో అద్దె భవనంలో నిర్వహించుకునేందుకు అనుమతివ్వాలని సూర్యాపేట కలెక్టర్‌కు సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

కోదాడ ఏడీఏ బదిలీ

సూర్యాపేట జిల్లా కోదాడ వ్యవసాయ శాఖ ఏడీఏగా యల్లయ్య అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది ములుగు జిల్లాకు బదిలీ అయ్యారు. యల్లయ్య మరో రెండు నెలల్లో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఆయనకు పదోన్నతి కల్పించి బదిలీ చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

సత్వర న్యాయం దిశగా



» అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక మహిళా పోలీస్‌స్టేషన్

» తెలంగాణ పోలీసు శాఖ ప్రణాళిక

» ఆలోచన సాకారమైతే బాధిత మహిళకు సత్వర న్యాయం

(ఆంధ్రజ్యోతి-భువనగిరిటౌన్): ప్రస్తుతం ప్రతి జిల్లాకేంద్రంలో ఒక మహిళా పోలీస్‌స్టేషన్ ఉంది. అక్కడ కేవలం గృహహింస, వరకట్న వేధింపులు, కుటుంబ విభేదాల ఫిర్యాదులను మాత్రమే స్వీకరిస్తున్నారు. లైంగిక, భౌతిక, మానసిక తదితర వేధింపులకు గురయ్యే మహిళలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనే ఫిర్యాదు చేయాల్సి ఉంది. తాము ఎదుర్కొంటున్న దాడులను, బాధలను పోలీస్‌స్టేషన్లలోనే పురుష పోలీ స్ అధికారులకు సవివరంగా చెప్పుకోలేని పరిస్థి తి బాధిత మహిళలది. పలువురు గృహ హింస బాధిత మహిళలు కేవలం జిల్లాకేంద్రాల్లో ఉన్న మహిళా పోలీస్‌స్టేషన్లకు ఇతర వేధింపులకు గురవుతున్న పలువురు మహిళలు స్థానిక పోలీస్‌స్టేషన్లకు పలు కారణాలతో వెళ్లలేక పోతున్నా రు. ధైర్యం చేసి వెళ్తున్నా ఆయా పోలీస్‌స్టేషన్ల లో మహిళా సిబ్బంది తక్కువగా ఉండడం, శాంతి భద్రతల పరిరక్షణ ఫిర్యాదులు, అధికంగా ఉంటుండడంతో మహిళల ఫిర్యాదులపై పోలీస్ అధికారులు దృష్టి సారించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో మహి ళలకు సత్వర న్యాయం లక్ష్యంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఒక మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు దిశగా తె లంగాణ పోలీస్ శాఖ ప్రణాళిక రూపొందిస్తోం ది. ఈ ఆలోచన అమలులోకి వస్తే త్వరలోనే ప్రతి నియోజకవర్గంలో ఒక మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు అయ్యే అవకాశాలున్నాయి.

విధి విధానాల ఖరారుతోనే స్పష్టత

మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది కొరత కారణంగా ప్రస్తుతం జిల్లాకేంద్రాల్లో ఉన్న మహిళా పోలీస్‌స్టేషన్‌లో కూడా పురుషాధికారులు, సిబ్బందితో నెట్టుకొస్తున్న పరిస్థితి. పోలీస్ ఉద్యోగ నియామకాల్లో కూడా మహిళల సంఖ్యను పెంచాలని ఆ శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్న క్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చాకే పోస్టుల భర్తీపై స్పష్టత రానున్నది. మహిళా పోలీస్ స్టేషన్ వ్యవస్థ సాకారమైతే బాధిత మహిళలకు సత్వర న్యాయం జరిగే అవకాశముంది.

మహిళా పోలీస్‌స్టేషన్లలో న్యాయం జరుగుతోంది



జిల్లా మహిళా పోలీస్ స్టేషన్‌కు వస్తున్న బాధిత మహిళలకు న్యాయం జరుగుతున్నది. స్వల్ప కారణాలతో తలెత్తుతున్న విభేదాలతో విడాకులు కోరుకుంటున్న జంటలకు కౌన్సిలింగ్ ద్వారా రాజీ కుదిరిస్తున్నాం. రాజీ పడని ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నాం.

– అర్జునయ్య, సీఐ, జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్, యాదాద్రి భువనగిరి

యాదాద్రి జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్‌లో ..

భువనగిరి జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్‌కు 2018 నుంచి 2025 మార్చి వరకు 4,866 ఫిర్యాదులు వచ్చాయి. కౌన్సిలింగ్‌లలో 4,242 ఫిర్యాదులలో రాజీపడగా 624 ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీంతో ఆ కేసులు కోర్టుల్లో కొనసాగుతున్నాయి. రాజీపడిన భార్యాభర్తలు, కుటుంబసభ్యులు తిరిగి మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తున్న ఘటనలు పెరుగుతున్నట్లు పోలీస్ అధికారులు అంటున్నారు.

అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక పోలీస్‌స్టేషన్..

పోలీస్ ఉన్నతాధికారులు ప్రతిపాదిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక మహిళా పోలీస్‌స్టేషన్ మంచి నిర్ణయమని పలువురు అంటున్నారు. ఫిర్యాదుల ఆధారంగా సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఎన్వవర్మెంట్ ఉమెన్(సీడీడబ్ల్యూ)లో మూడు పర్యాయాలు కౌన్సిలింగ్ చేస్తారు. అయినప్పటికీ కుటుం బ సభ్యులు భార్యాభర్తల మధ్య రాజీ కుదరకపోతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టు విచారణకు తీర్పుకు ఫిర్యాదుదారులు కట్టుబడాల్సి ఉంటుంది. ఫిర్యాదు అందిన 45రోజుల్లో మూడు పర్యాయాలు కౌన్సిలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. యాదాద్రిభువనగిరి, నల్లగొండ, సూర్యాపేటలో జిల్లాకేంద్రాల్లో మహిళా పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. పోలీస్ శాఖ తాజా ఆలోచనల ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12మహిళా పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు అయ్యే అవకాశాలున్నాయి. ప్రస్తుతం మూడు జిల్లా కేంద్రాల్లో ఉన్న మహిళా పోలీస్‌స్టేషన్లను జిల్లా మహిళా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌గా కొనసాగిస్తారా లేక స్థాయిని తగ్గించి అసెంబ్లీ పోలీస్‌స్టేషన్‌గా కొనసాగిస్తారో తేలాల్సి ఉంటుంది.

గృహ హింస ఫిర్యాదుల స్వీకరణకే

నిబంధనల ప్రకారం జిల్లాకేంద్రాల్లోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో వివాహిత మహిళలు ఎదుర్కొనే గృహ హింస, అత్తింటి కుటుంబ సభ్యుల లైంగిక మానసిక వేధింపులు, భౌతిక దాడులు వరకట్న వేధింపులు తదితర ఘటనలలో ఫిర్యాదులు స్వీకరించాల్సి ఉంటుంది. సిబ్బంది కొరత దర్యాప్తుల్లో ఎదురయ్యే ఇబ్బందులు తదితర కారణాలతో కేవలం గృహ హింస, వరకట్నం, వేధింపులు అనుమానాలు, తదితర కారణాలతో భార్యభర్తల్లో పెరుగుతున్న దూరం, కాపురానికి వద్దంటున్న కేసుల్లో మాత్రమే ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. అత్తింటి కుటుంబసభ్యుల లైంగిక భౌతిక, మానసిక దాడులు, ప్రయత్నాలపై స్థానిక పోలీస్‌స్టేషన్లలోనే ఫిర్యాదు చేయాలంటూ సూచిస్తూ వెనక్కి పంపిస్తున్నారు.

భద్రతా వారోత్సవాల్లో మైహోం సంస్థకు బహుమతులు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ భద్రతా వారోత్సవాలు సందర్భంగా నేషనల్ సేఫ్టీ కౌన్సిల్, తెలంగాణ రాష్ట్ర ఫ్యాక్టరీస్ డిపార్టుమెంట్ సంయుక్తంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించిన వరల్డ్ డే ఫర్ సేఫ్టీ అండ్ హెల్త్ వర్క్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రతపై కంపెనీ ఉద్యోగులకు పోటీలు నిర్వహించగా ఈ పోటీలలో పాల్గొన్న మైహోం సంస్థ ఉద్యోగులు ఎం.ప్రకాష్, సేఫ్టీ స్లోగన్ విభాగంలో ప్రథమ బహుమతి; నాగరాజు, వ్యాసరచనలో ప్రథమ బహుమతి; ఓంకార్,వ్యాసరచనలో ద్వితీయ బహుమతి; వై. నాగేశ్వరరావు, స్లోగన్ విభాగంలో తృతీయ బహుమతి గెల్చుకున్నారు. విజేతలకు తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ పి.రాజగోపాల్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మైహోం పరిశ్రమ హెడ్ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ మైహోం పరిశ్రమలో ఉద్యోగుల భద్రతపై అవగాహన కల్పిస్తున్నందునే ఈ బహుమతులు వచ్చాయన్నారు. విజేతలైన ఉద్యోగులకు ఆయన అభినందనలు తెలిపారు.



బహుమతులు అందుకుంటున్న మైహోం ఉద్యోగులు

వైభవంగా లక్ష్మీనృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహుని క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం స్వామివారికి మాంగల్య ధారణ తలంబ్రాలుతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు నీరాజన మంత్రపుష్పాలతో మహా నివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలుఅందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.



లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు

నేడు 'భూ భారతి'పై అవగాహన సదస్సు

శాలిగౌరారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండల కేంద్రంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 29న మంగళవారం ఉదయం 9 గంటలకు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ యాదగిరి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు, ఆర్డీవో అశోక్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. సదస్సుకు రైతులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శంకర్



నల్లగొండరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఐమ్మంపాటి శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మం జిల్లాలో నిర్వహించిన సంఘం రాష్ట్ర సమావేశాల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లాకు చెందిన ఆకారపు నరేష్, కుర్ర సైదానాయక్, కుంచం కావ్యలను రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సౌడమ్మ జాతరకు దిష్టిపూజ మహోత్సవం



సౌడమ్మ తల్లి ఆలయం వద్ద దిష్టిపూజ మహోత్సవంలో పాల్గొన్న యాదవులు

కేతేపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కేతేపల్లిలో యాదవుల ఆరాధ్య దైవం సౌడమ్మ తల్లి జాతరకు సోమవారం దిష్టిపూజ మహోత్సవం నిర్వహించారు. సౌడమ్మ తల్లి జాతరకు 15 రోజుల ముందు దిష్టి పూజ నిర్వహించడం ఆనవాయితీ. ఇక్కడ సౌడమ్మ తల్లి జాతరను మే 11, 12 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం యాదవులు, జాతర నిర్వాహకులు సౌడమ్మ తల్లికి దిష్టి పూజను నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు జె.వెంకటనర్సయ్యయాదవ్, ఉప్పల సోమలింగంయాదవ్, వి.అబ్బయ్య, జటంగి దేవ లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తయ్య

నల్లగొండరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా మేడేను కార్మికులు ఘనంగా నిర్వహించాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్ఎల్‌బీసీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారం నిర్వహించిన హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పని ప్రదేశాలు, అడ్డాలలో జెండాలను ఆవిష్కరించాలని, ర్యాలీలు వైభవంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో ఐదు లక్షల మంది వివిధ విభాగాల్లో హమాలీ కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి సామాజిక భద్రత సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా ఆందోళన పోరాటాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు అవుట రవీందర్, శ్రీకాంత్, రాజు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశాలను సభలకు తరలించవద్దు : సీఐటీయూ

నల్లగొండరూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తున్నారని ప్రభుత్వ కార్యకలాపాల పేరుతో ఆశా వర్కర్లను తరలించవద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రి సమావేశానికి వస్తున్న ఆశావర్కర్ ఆటో నుంచి కిందపడింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆశా వర్కర్ శ్రీదేవి నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పరామర్శించి మాట్లాడారు. మంత్రి వెంకట్‌రెడ్డి నల్లగొండకు వస్తున్నారనే పేరుతో చుట్టుపక్కల మండలాల ఆశా వర్కర్లను ఉదయం 10 గంటలకు నల్లగొండకు పిలిపించారని అన్నారు. వారికి ఒక మజ్జిగ ప్యాకెట్ ఇచ్చి రెండు గంటల వరకు అక్కడనే ఉంచడంతో అనేక మంది తీవ్ర ఇబ్బందులు పడినట్లు తెలిపారు. ఇదే కార్యక్రమానికి వచ్చిన కట్టంగూరు మండలం ఈదులూరు ఆశా వర్కర్, శ్రీదేవి ఆటోలో ప్రయనిస్తుండగా స్పృహ తప్పి ఆటో నుంచి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. సమావేశాలకు వెళ్లాలని పురమాయిస్తున్న మెడికల్ ఆఫీసర్లు ఎవరి ఆదేశాలతో ఇలాంటి సభలు సమావేశాలకు పంపుతున్నారని ఆయన ప్రశ్నించారు. అక్కడికి వెళ్లిన ఆశాలకు కనీసం టీఏ, డీఏలు కూడా ఇవ్వడం లేదని అన్నారు. వెళ్లకపోతే తీవ్రమైన వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇలానే ప్రభుత్వ కార్యకలాపాల పేరుతో ఆశాలు, అంగన్‌వాడీలు, గ్రామపంచాయతీ కార్మికులను తరలించాలని ఆయా సందర్భాల్లో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వారికి సంబంధం లేని సభలు సమావేశాలకు తీసుకెళ్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. పరామర్శించిన వారిలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పెంజర్ల సైదులు, ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తవిటి వెంకటమ్మ, నాయకురాలు చెరుకు జానకి, సీహెచ్ ధనలక్ష్మి, భూపతి రేణుక, శోభ, మంగమ్మ, పార్వతి రేణుక, అనిత, రజిత పాల్గొన్నారు.



ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బొంతల చంద్రారెడ్డి, ఆర్టీసీ ఎంప్లాయిస్ నాయకులు

సిటీ బస్సులను చిట్యాల వరకు పొడిగించాలి

- వెలిమినేడుకు నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలి
- ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతి

చిట్యాలరూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ నుంచి చౌటుప్పల్ వరకు వచ్చే సిటీ బస్సులను చిట్యాల వరకు పొడిగించాలని బొంతల చంద్రారెడ్డి, వెలిమినేడు పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బొంతల అంజిరెడ్డి కోరారు. వెలిమినేడు ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు పాటు వెలిమినేడు, గుండ్రాంపల్లి, పెద్దకాపర్తి వారే కాకుండా రామన్నపేట, మునుగోడు మండలం నుంచి వేలాదిమంది ప్రయాణికులు వస్తుంటారు. చిట్యాల మీదుగా నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, ఖమ్మం జిల్లా నుంచి బస్సులు ప్రయాణికులతో నిండి ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి వారికి ఆ బస్సుల్లో ఎక్కేందుకు వీలుకావడంలేదన్నారు. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ నుంచి యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ వరకు వచ్చే సిటీ బస్సులను చిట్యాల వరకు పొడిగిస్తే వేలాది మంది ప్ర యాణికులకు సౌకర్యంగా సౌలభ్యంగా ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా ఉమ్మడి జిల్లా నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులను వెలిమినేడులో ఆపితే హైదరాబాద్‌తో పాటు నల్లగొండతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వెలిమినేడు గ్రామానికి ఇదివరకు హైదరాబాద్ నైట్‌హాల్ట్ బస్సు ఉండేదని, దాని వల్ల ఎంతో మందికి ఉపయోగకరంగా ఉండేదని నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సిటీ బస్సులను చిట్యాల వరకు పొడిగించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలి



నాంపల్లిలో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

● అన్నదాతల ఆందోళన

నాంపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రంలో అధికారులు రైతుల ధాన్యం కాకుండా మధ్యవర్తుల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు. కొనుగోళ్లలో అవకతవకను నిరసిస్తూ సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. మార్కెట్ యార్డులు, ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 20 రోజుల నుంచి ధాన్యం తీసుకొచ్చిన అధికారులు కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆరోపించారు. గోనె సంచులు రైతులకు ఇవ్వకుండా వారికి నచ్చిన వారికి రాత్రి సమయాల్లో అందిస్తున్నారని, పేద రైతులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. మండు టెండల్లో నీడ, తాగునీరు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, ధా న్యం కొనుగోలు చేయకపోవడంతో 20 రోజుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దే రాత్రీపగలు తేడా లేకుండా పడిగాపులు కాస్తున్నామని వాపోయారు. తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ దేవసింగ్‌ను వివరణ కోరగా రైతులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్నాను. రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్ల వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామని, మచ్చర్ వచ్చిన ప్రతి రైతుకు గోనె సంచులు అందిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

గట్టుప్పల్: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రావుల ఎల్లప్ప డిమాండ్ చేశారు. గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి గ్రామ రహదారిపై పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్లప్ప మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని సరిగా తూకం వేయకుండా అధికారులు రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎప్పటికప్పుడు సరిగా కొనుగోలు చేసి రైతుల ఖాతాలో వెంటనే డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగంపై నిర్లక్ష్యం వీడకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ధర్నాలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు దుర్గయ్య, నాయకులు శ్రీను, మారయ్య, జంగయ్య, శంకర్, నరసింహ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తేరట్‌పల్లి గ్రామంలో ధర్నా చేస్తున్న రైతులు, బీజేపీ నాయకులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంవిధాన్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో జైబాపూ, జైభీమ్, జైసంవిధాన్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ మర్రిగూడ బైపాస్ నుంచి నిర్వహించగా పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నల్లగొండ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులతో అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద జైబాపూ, జైభీమ్, జైసంవిధాన్ ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వంగూరి లక్ష్మయ్య, నాయకులు కత్తుల కోటి తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో డీసీసీబీ



జిల్లా కేంద్రంలోని డీసీసీబీ కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డికి డీసీసీబీ గురించి వివరిస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

పౌరసరఫరాల శాఖ ఎగ్జిబిషన్



పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రి వెంకట్‌రెడ్డి, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి

'ఇందిరమ్మ' తొలివిడత చెక్కు



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సభలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తొలి విడత చెక్కులను అందజేస్తున్న మంత్రులు మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రి వెంకట్‌రెడ్డి, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

పోరాటాలతోనే సమూల మార్పులు



జనజాతర బహిరంగ సభలో అభివాదం చేస్తున్న నాయకులు కాశీం, జూలకంటి రంగారెడ్డి వివిధ నాయకులు

(5వపేజీ తరువాయి)

లేదని, ఇవన్నీ లేకపోవడంతోనే ఈ దేశంలో దళిత, బహుజన వర్గాల పరిస్థితి దీనంగా ఉందన్నారు. దేశంలో దళిత, బహుజన వర్గాలు పనిచేసుకుంటూనే పనితోపాటు చదువు నేర్చుకోవాలని అంబేడ్కర్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

అంతరాలు సృష్టిస్తున్నారు

విద్య కింది వర్గాలకు అందకుండా నేడున్న ప్రభుత్వాలు అంతరాలు సృష్టిస్తున్నాయని కాశీం అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం మూస ధోరణిలో ఉందని, మొత్తంగా మను ధర్మశాస్త్రాన్ని, మనువాదాన్ని పాఠ్యాంశాలుగా చేర్చడానికి కుటిల ప్రయత్నాలు చేస్తోందన్నారు. చైతన్యవంతమైన సమాజాన్ని తిరోగమనం వైపు తీసుకు పోయే ప్రయత్నం చేస్తుందన్నారు. విద్య వివేకం ఇవ్వాలని, విద్య చైతన్యం ఇవ్వాలని పూల, అంబేడ్కర్ కోరుకున్నారన్నారు. ఇప్పుడున్న పాలకులు మాత్రం మూఢనమ్మకాలు, అశాస్త్రీయ అంశాలను చొప్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కశ్మీర్ ఫైల్స్, రజాకార్ ఫైల్స్ వంటి సినిమాలు తీసి చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ భావజాలమే బడుగులకు మార్గమన్నారు. మతోన్మాద శక్తులు ఈ దేశంలో మనువాదాన్ని అడ్డం పెట్టుకొని పెట్రేగి పోతున్నాయన్నారు.

దేశంలో బీజేపీ వివక్షతను పెంచి పోషిస్తుందన్నారు. ఏపూరి సోమన్న ఆటపాటలతో అలరించారు. సభకు స్వాగతోపన్యాసం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున చేయగా, జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, మహాత్మా గాంధీ యూనివర్సిటీ అధ్యాపకురాలు అనిత తదితరులు పాల్గొన్నారు.



హాజరైన నాయకులు



జన జాతర బహిరంగ సభలో పాల్గొన్న ప్రజలు

వరి పరిశోధనలో ముందడుగు



పరిశోధన కేంద్రంలో విశాలమైన ప్రధాన రహదారి



పరిశోధనలో భాగంగా వరి సాగు

(5వపేజీ తరువాయి)

800 క్వింటాళ్ల బీపీటీ-5204, 300 క్వింటాళ్ల కేఎన్ఎమ్- 1638, 50 క్వింటాళ్ల కేపీఎస్-2874, 50 క్వింటాళ్ల కేపీఎస్-6251, 100 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్-15048 విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి.

వరి సాగులో వివిధ పద్ధతులు..

వరి సాగు విధానంపై పరిశోధనలు జరుగుతున్నాయి. నేరుగా వెదజల్లడం, నాటుయంత్రం, మెట్ట వరి, డ్రమ్ సీడర్ పద్ధతుల్లో వరిసాగు చేపడుతున్నారు. సాగు ఖర్చులు, తెగుళ్ల నియంత్రణ, దిగుబడులు, గింజ నాణ్యత తదితర అంశాలపై విస్తృత పరిశోధనలు సాగిస్తున్నారు.




వరి సాగు

మార్కెట్లోకి నూతన వంగడాలు

నూతన వరి వంగడాల రూపకల్పనకు విస్తృత స్థాయిలో పరిశోధనలు సాగుతున్నాయి. విత్తనం వివిధ దశలు దాటి రైతుల వద్దకు చేరాలంటే కనీసం 15 ఏళ్లు పడుతుంది. ప్రస్తుతం ప్రైవేటు విత్తనాలకు దీటుగా జేజీఎల్-27356, కేపీఎస్-10642 రకాలు అందుబాటులో ఉన్నాయి. ఇవి పచ్చి ధాన్యం నేరుగా(ఆరబెట్టకుండా) విక్రయించుకోవడానికి అనుకూలమైన రకాలు. తెగుళ్లను సమర్థంగా తట్టుకోవడంతో సాగు వ్యయం తగ్గుతుంది. మంచి దిగుబడులు వస్తాయి. రైతులకు ప్రయోజనం కలుగుతుంది. రకాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ లింగయ్య, హెడ్ శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, కంపాసాగర్



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	230	260
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 23.0

నాలుగేళ్లలో ప్రాజెక్టులను పూర్తి చేస్తాం :ఉత్తమ్



బీఆర్ఎస్ హయాంలో పదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైన ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గాన్ని కూడా ఈ టర్మ్‌లోనే పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ అన్నారు. అక్కడ జరిగిన ప్రమాదంతో తాత్కాలిక ఇబ్బందులను అధిగమించి పనులు చేయిస్తామన్నారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో 80ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిండి ఎత్తిపోతలకు నీరందించే ఏదుల-డిండి పథకానికి రూ.1800కోట్లతో తమ ప్రభుత్వం టెండర్లు పిలిచి, పనులు చేపడుతోందన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అవసరమైన ఎత్తిపోతల పథకాలన్నింటికీ నిధులు మంజూరు చేసి పనులు చేపడతామన్నారు. మంత్రి వెంకటరెడ్డి అయిదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారని, మరో పర్యాయం ఎంపీగానూ పనిచేశారన్నారు. ఆయన నల్లగొండ అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రూ.700కోట్లతో రింగ్‌రోడ్డు, లతీఫ్‌సాబ్ గుట్ట, బ్రహ్మంగారి గుట్టలపైకి ఘాట్‌రోడ్లు, రోప్‌వేల నిర్మాణాల పనులు శరవేగంగా సాగుతుండడం గమనించానని తెలిపారు. మంత్రి వెంకటరెడ్డి కోరిక మేరకు ఏఎమ్మార్పీ హైలెవల్ కాల్వ లైనింగ్ ప్రాజెక్టుకు రూ.442 కోట్ల నిధులు మంజూరుచేశామని, త్వరలో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. గుండ్లపల్లి-ఉదయసముద్రం పథకానికి రూ.92 కోట్లు, భీమసముద్రం-చర్లపల్లి - మిగతా 7వ పేజీలో...




నల్లగొండ కలెక్టరేట్‌లో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఉమ్మడి జిల్లా సస్యశ్యామలమే లక్ష్యం

- 80 ఏళ్ల కల డిండి ఎత్తిపోతల ద్వారా నెరవేరుతుంది : ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నాం : మంత్రి వెంకటరెడ్డి
- నల్లగొండ నియోజకవర్గంలో రూ.36 కోట్లతో మూడు లిఫ్టులకు శంకుస్థాపన
- కలెక్టరేట్ వద్ద బహిరంగసభ
- తరలివచ్చిన ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

నల్లగొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసే అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను ఈ నాలుగేళ్లలోనే పూర్తిచేసి తీరుతామని నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో రూ.46.25 కోట్ల అంచనావ్యయంతో చేపడుతున్న బక్కతాయికుంట, పానుగోడు, నర్సింగ్‌భట్ల ఎత్తిపోతల పథకాలకు, రూ.36కోట్ల అంచనావ్యయంతో నిర్మించతలపెట్టిన కలెక్టరేట్ అదనపు బ్లాక్ నిర్మాణానికి సోమవారం రోడ్లు, భవనాలశాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో - మిగతా 7వ పేజీలో...

అర్థం లేకుండా మాట్లాడుతున్నారు : మంత్రి కోమటిరెడ్డి



తాము తల్చుకుంటే వరంగల్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన సభకంటే నాలుగురెట్ల సభను నల్లగొండలో పెట్టగలమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ అర్థం లేకుండా మాట్లాడుతున్నారని, మేం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో దాదాపు అయిదునెలలు ఎన్నికల కోడ్ వచ్చిందని, మిగిలిన 11 నెలల్లోనే తాము ఇన్ని పను లు చేసినందుకు ఓర్వలేకపోతున్నారని దుయ్యబట్టారు. నల్లగొండ జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. రహదారులు, సాగునీటి ప్రాజెక్టుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. ఉమ్మడిజిల్లాలో రూ.1600కోట్లతో ఇప్పటికే రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరుచేశామన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను బీఆర్ఎస్ పదేళ్లలో పడావు పెట్టిందన్నారు. మళ్లీ కాంగ్రెస్ వచ్చాకే ఈ పథకం పనులు ప్రారంభమయ్యాక.. - మిగతా 7వ పేజీలో...

భారీ ప్రదర్శనగా మంత్రుల ర్యాలీ

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనల నిమిత్తం జిల్లాకేంద్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటన నేపథ్యంలో సోమవారం కాంగ్రెస్ శ్రేణులు నల్లగొండ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. కార్లతోపాటు, బైక్‌లతో ఈ ర్యాలీలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. మంత్రులిద్దరూ ఓపెన్‌టాప్ కారులో నిలబడి కార్యకర్తలకు అభివాదం చేస్తూ ఉత్సాహపరుస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. జైకాంగ్రెస్, జై కోమటిరెడ్డి నినాదాలతో ర్యాలీలో కార్యకర్తలు సందడి చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నాయకులు లక్ష్మయ్య, అబ్బగోని రమేష్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లాకేంద్రంలో ర్యాలీలో పాల్గొన్న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. సోమవారం పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో భాగంగా వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన అర్జీదారుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎవరైనా చట్ట వ్యతిరేకమైనా చర్యలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఫిర్యాదుదారులకు భరోసా, నమ్మకం కలిగించినప్పుడే పోలీస్‌శాఖపై విశ్వాసం ఉంటుందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి దరఖాస్తులు స్వీకరించాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరవ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. అంతకుముందే జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 28మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలను అందజేయాలన్నారు.

వరి పరిశోధనలో ముందడుగు

- ప్రైవేటుకు దీటుగా మార్కెట్లోకి నూతన వంగడాలు
- అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రంతో సంయుక్తంగా..
- కంపాసాగర్ పరిశోధన కేంద్రంలో 42వంగడాలపై



వరి పరిశోధనా స్థానం

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పరిధిలోని ఆయకట్టు దశాబ్దాలుగా వరి సాగుకు ప్రసిద్ధి. ఈ ప్రాంతానికి నూతన, అత్యున్నత వంగడాలు అందించాలని అప్పటి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. త్రిపురారం మండలం కంపసాగర్ గ్రామ పరిధిలో 2005లో వ్యవసాయ పరిశోధనా స్థానంను ఏర్పాటు చేసింది. నాణ్యమైన విత్తనాల ఉత్పత్తితో పాటు వివిధ వరి వంగడాల రూపకల్పన, ఆధునిక పద్ధతిలో వరిసాగు లక్ష్యంగా ఈ సంస్థ పని చేస్తోంది.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ వ్యవసాయం)

వ్యవసాయ పరిశోధనా సంస్థ మొత్తం 305 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. కేవీకేతోపాటు సాగు నీటి కాల్వలు, పాలన కార్యాలయాలు వివిధ ప్రజా అవసరాలకు పోను సుమారు వంద ఎకరాల్లో విత్తనాభివృద్ధి, నూతన వంగడాలపై పరిశోధనలు సాగుతున్నాయి. ఫిలిప్పిన్స్ దేశంలో ఉన్న అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కంపసాగర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో స్వల్పకాలిక, దొడ్డు గింజ రకాల్లో నూతన వరి వంగడాల రూప కల్పనకు మూడేళ్ల సంయుక్తంగా పరిశోధనలు సాగిస్తున్నాయి. మొత్తం 42వరి రకాలపై విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి.

కొత్త వంగడాలు....

కేపీఎస్-6251 అనే కొత్త రకం మినికిట్ దశ పూర్తి చేసుకుంది. ఇది సన్నగింజ రకం, పంట కాలం-115 రోజులు చౌడును తట్టుకుని ఎకరానికి 45 బస్తాల వరకు దిగుబడి ఇస్తుంది. ఖరీఫ్, రబీ కాలాలకు అనువైంది. దోమ పోటు, అగ్గితెగులు తట్టుకునే స్వల్పకాలిక సన్న గింజ రకం. సన్న గింజగా ఐకేపీ కేంద్రాల్లో విక్రయించవచ్చు. ప్రభుత్వ బోనస్ పొందే రకం.

- కేపీఎస్-10631, కేపీఎస్-10642 సన్నరకం (పచ్చి ధాన్యం విక్రయానికి అనుకూలం)
- కేపీఎస్-10329 దొడ్డు రకం వరి, పంట కాలం 120 రోజులు, 45-50 బస్తాల దిగుబడి వస్తుంది. ఏడాదిలో మార్కెట్లోకి విడుదలైంది.
- కోసిన ధాన్యం పచ్చిగా ఉన్నప్పుడే నేరుగా (పచ్చిగా)విక్రయించే రకాలున్నాయి. అన్ని రకాల తెగుళ్ల, మంచి దిగుబడులు వచ్చే వంగడాలు విడుదల చేయడానికి పరిశోధనా స్థానంలో ప్రణాళికలు సిద్ధం చేశారు.

నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి...

పరిశోధనా సంస్థ ప్రారంభంనుంచే బీపీటీ-5204, కెన్ఎమ్, జేజీఎల్‌వంటి రకాలను విత్తనోత్పత్తి చేసి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేస్తున్నారు. పరిశోధనా స్థానంలో ప్రతి ఏటా ఖరీఫ్, రబీ కలిపి సుమారు 4వేల క్వింటాళ్ల వరకు విత్తనోత్పత్తి జరుగుతుంది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ పరిధిలోని వివిధ పరిశోధనా సంస్థల్లో విడుదలయిన నూతన రకాల విత్తనాలు ఇక్కడి రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు.

ఈ ఏడాది: వచ్చే ఖరీఫ్‌కోసం వివిధరకాల వరి వంగడాలు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం... - మిగతా 8వ పేజీలో...

కంపాసాగర్ వరి-1 రూపకల్పన

ఇప్పటికే కంపసాగర్ పరిశోధనా స్థానం నుంచి కంపాసాగర్ వరి (కేపీఎస్-2874) అనే రకం 2021లో వివిధ దశలు పూర్తి చేసుకుని మార్కెట్లోకి వచ్చింది. ఎంటీయూ-1010, ఎన్ఎల్ఆర్-34449 రకాలను అనువంశికత వలన ఈ రకం రూపొందింది. ఈరకం వానా కాలానికి అనువైంది. పంట కాలం 135 నుంచి 140రోజులు, దిగుబడి 32 నుంచి 34 క్వింటాళ్లు వస్తుంది. గింజరకం-మధ్యస్థ సన్నం, వానాకాలానికి అనువైన రకం, సుడిదోమ, అగ్గితెగులును సమర్థవంతంగా తట్టుకుంటుంది. తక్కువ నత్రజనితో (25శాతం తక్కువ) చౌడు నేలల్లోనూ మంచి దిగుబడినిస్తుంది. ఈ రకాన్ని సాగర్ ఆయకట్టుతోపాటు ఉత్తర తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్, కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర నది ప్రాజెక్ట్ పరిధిలో అత్యధికంగా సాగు చేస్తున్నారు.

మామిడీలా

● యాదాద్రి భువనగిరి జిల్లాలో తగ్గిన మామిడి దిగుబడి



మామిడి దిగుబడి జిల్లాలో ఈ సారి గణనీయంగా తగ్గింది. వాతావరణంలో వచ్చిన మార్పులతో పూత కూ డా ఆలస్యంగా వచ్చింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో మామిడిచెట్లకు కాసిన పూత కొంతమేరకు రాలిపోయింది. దీనికి తోడు ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయా యి. ఒకప్పుడు మూడు ఇంచుల వరకు పోసే బోర్లు ఇంచునీరు రావడంలేదు. దీంతో జిల్లాలో పలుప్రాంతాల్లో ఉన్న మామిడి తోటలు ఎండుముఖం పడుతున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షంతో మామిడికాయలు నేలరాలాయి. జిల్లాలోని 17 మండలాల్లోనూ మామిడి తోటలు ఉన్నాయి. అయితే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని తుర్కపల్లి, రాజాపే ట, బొమ్మలరామారం, భువనగిరి, బీబీనగర్ మండలాల్లో అధికంగా మామిడితోట లు ఉన్నాయి. జిల్లాలోని తుర్కపల్లి, రాజపేట, బొమ్మలరామారం, గుం డాల, ఆత్మకూరు(ఎం), తదిత ర మండలాల్లో వడగండ్ల వర్షాలకు చెట్లపై కొమ్మలు, కాయలు లేకుండా రాలిపోయా యి. జిల్లాలో ప్రధానంగా బంగినపల్లి, దసేరి, రసాలు వంటి మామిడి పండ్లను ఎక్కువగా పండిస్తారు. జిల్లా వ్యాప్తంగా 11వేల ఎకరాల్లో మామిడిని సాగు చేస్తున్నా రు. పూతకు రాని ఐదేళ్లలోపు ఉన్న మామిడి చెట్లు మరో 2వేల ఎకరాల వరకు ఉన్నాయి. ప్రతీ సంవత్స రం జిల్లానుంచి దాదాపు 23వేల మెట్రిక్ టన్నుల మామిడి పంట దిగుబడి అవుతుంది. కానీ ఈసారి ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం, నీటి ఎద్ద డి, వర్షాభావ పరిస్థితులుతో 18వేల టన్నుల మామిడి దిగుబడి అయ్యే అవకాశం ఉందని ఉద్యాన అధికారు లు అంచనా వేస్తున్నారు. అయితే ఇటీవల వీచిన గాలి దుమారాలకు చెట్లపై ఉన్న సగం కాయలు రాలిపోయాయి. ఇటు వాతావరణం, అటు కరువు పరిస్థితుల నడుమ మామిడి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. మామిడి తోటలను లీజుకు తీసుకున్న వారు కూడా ఈ సారి తీవ్ర నష్టాల ను చవిచూస్తున్నారు.

తోటల్లో కాయలు అనుకున్నంత సైజులో పండకపోవడం తో వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్లకు సరిగ్గా నీరు లేకపోవడంతో కాయల సైజు బాగా తగ్గింది. మామిడి పండ్లు ఈ సారి జిల్లా ప్రజలు మరింత ప్రియంకానున్నాయి. ఇప్పటికే మార్కెట్లో మామిడిపండ్ల ధరలకు లెక్కలొచ్చాయి. రైతుల వద్ద తక్కువ ధరకు తీసుకుని వ్యాపారులు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో గతం కంటే మామిడి పండ్ల ధరలు పెరిగిపోయాయి.

పోషక విలువలు ఉత్పత్తి కావు

మామిడి కాయలు పరిపక్వానికి రాకముందే కార్బైడ్ ఉపయోగించి మగ్గించిన పండ్లు తినడం ద్వారా తీవ్ర అనారోగ్యం పాలవుతారని వ్యవసాయ శాస్త్రవేత్తలు వెల్లడించారు. పరిపక్వానికి రాని మామిడికాయల్లో పోషక విలువలు ఉత్పత్తి కావు. దీంతో పండ్లు రుచికరంగా కూడా ఉండవు. మామిడి చెట్టుకు పండ్లు పరిపక్వానికి వచ్చిన వెంటనే లెంటిసెల్స్ కన్పిస్తాయి. కాయ తొడిమే దగ్గర పసుపుపచ్చని రంగు ఏర్పడుతుంది. మామిడికాయపై చుక్కలు పెద్దగా వస్తాయని వ్యవసాయశాస్త్రవేత్తలు పే ర్కొంటున్నారు. మామిడి కాయ పరిమాణం కూడా బాగా పెరుగుతుంది. మామిడి పంటపై పూర్తి అవగాహన ఉన్న రైతులు పక్వానికి వచ్చిన విషయాన్ని గ్రహిస్తారని, కాయ పరిమాణాన్ని గుర్తించి పండ్లు కోస్తారు. పరిపక్వానికి వచ్చిన మామిడికాయలను మగ్గించేందుకు ఆహార సలహా కమిటీ సూచించిన మేరకు ఇథెరెల్ అనే మందును ఉపయోగిస్తే ఎలాంటి రోగాలు రావు. పరిపక్వానికి రాని పండ్లలో చెక్కర శాతం ఉత్పత్తి కాక రుచికరంగా కూడా ఉండవు. పరిపక్వానికి వచ్చిన మామిడి కాయను ఒక చోట చేర్చి, ఇథెరెల్ 200 పీపీఎం వరకు కాయలపై పిచికారీ కాని, కుప్పల్లో ఒక మూలన గిన్నెలో పెడితే పండ్లు మగ్గుతాయి. కార్బైడ్ ఉపయోగించిన పండ్లను తిం టే వాంతులు, విరేచనాలు, చర్మ, గొంతు, జలుబు, ముక్కు, కళ్లకు సంబంధించిన వ్యాధులు సంక్రమిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతేకాకుండా అజీర్ణత ప్రభావం కూడా ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కార్బైడ్ ఉపయోగించిన మామిడి పండ్లను తినకూడదని సూచిస్తున్నారు.

పొంచి ఉన్న ముప్పు

మరోవైపు వ్యాపారులు పక్వానికి రాని కాయలను రసాయనాలతో పండ్లుగా మారేలా చేస్తున్నారు. అవి కొనుగోలు చేసి తి న్న వారు మాత్రం రోగాలబారిన పడతారు. దీంతో ఈ మామిడి పండ్ల సీజన్‌లో ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లనుం ది. పరిపక్వంలేని మామిడి కాయల్లో కాల్షియం కార్బయిడ్ ఉపయోగిస్తే వ్యాపారులపై చర్యలు తీసుకోనున్నట్లు ఉత్వర్వులు జారీచేశారు. మార్కెట్ లో పరిపక్వానికి వచ్చిన మామిడి పండ్లను మాత్రమే విక్రయించాలని, లేదంటే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్వర్వులను వ్యాపారులు కచ్చితంగా పాటించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వరంగల్‌లో నిర్వహించిన రజతోత్సవ సభ విజయవంతమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం దేవరకొండలో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజతోత్సవ సభను అడ్డుకోవాలని కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. సభా స్థలానికి వెళ్లనివ్వకుండా ట్రాఫిక్ జాం చేసి వందలాది వాహనాలను తిప్పి పంపినా, ప్రజలు స్వచ్ఛందంగా వచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంఖాయమన్నారు. సమావేశంలో గాజుల ఆంజనేయులు, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, నీల రవికుమార్, వేములరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమూల మార్పులు



బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం, వేదికపై మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

- ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం
- విద్యయే బలమైన ఆయుధం

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే సమాజంలో సమూల మార్పులు చోటు చేసుకుంటాయని ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని గడియారం చౌరస్తాలో పూలే, అంబేడ్కర్ జన జాతర బహిరంగసభను సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆలోచనలే ఈ దేశంలోని బలహీన వర్గాలకు బలమైన ఆయుధాలని, వాటి ద్వారానే సమానత్వం సాధ్యమన్నారు. దేశంలో బ్రాహ్మణ ఆధిపత్య వర్గాలు అంతరాలు సృష్టిస్తూ లబ్ధి పొందుతున్నాయని, ఈ వ్యవస్థను అర్థం చేసుకోలేనంత కాలం మనం మనుగడ సాధించలేమన్నారు. అంబేడ్కర్, పూలే మహనీయులు ఈ దేశ చరిత్రలో నిలిచిపోయారంటే, అందుకు కారణం చదువేనని, విద్యతోనే భవిష్యత్ ఉంటుందన్నారు. విద్య లేకపోతే వివేకం లేదు, వివేకం లేకపోతే చైతన్యం... - మిగతా 8వ పేజీలో...

పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను రాయితీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. సోమవారం కార్యాలయంలో మాట్లాడుతూ ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుపై 5 శాతం, ఎల్ఆర్ ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ ఫీజులో 25శాతం రాయితీ నెలాఖరుతో ముగుస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్థిక సాయం

మాడ్గులపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుపల్లి గ్రామానికి చెందిన కమ్మరి పిచ్చమ్మ సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మహనీయుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల లక్ష్మయ్య పిచ్చమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అంద జేశారు.

భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

● రమాకాంత్‌శర్మ, తహసీల్దార్,చింతపల్లి



ఇంటర్వ్యూ Interview

పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసకుంటోంది. ఇందులో భాగంగా గతంలో ధరణి వెబ్‌సైట్ స్థానంలో భూభారతి చట్టం తీసుకొచ్చిందని చింతపల్లి తహసీల్దార్ రమాకాంత్‌శర్మ సోమవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.
(ఆంధ్రజ్యోతి-చింతపల్లి)

ఆంధ్రజ్యోతి: భూభారతి పోర్టల్ ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరుతుంది ?

తహసీల్దార్: గతంలో ధరణి తప్పులను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటిని సరిదిద్దుకునేందుకు ఆర్డీవోకు అప్పీల్ చేసుకుంటే పరిశీలించి భూభారతి ద్వారా పరిష్కరిస్తాం.

ఆంధ్రజ్యోతి: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతుల్లో భూసమస్యలతో పాటు అపోహలు తొలిగిపోతాయా ?

తహసీల్దార్: భూ సమస్యలు ఏస్థాయిలో ఉన్నా సివిల్ కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేదు. వారసత్వం ద్వారా కుటుంబీకులకు భూమిపై హక్కులను కల్పించేందుకు కేవలం 30 రోజుల్లో క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వాటిని అమలు చేస్తాం. ఒకవేళ అమలు చేయకపోయిన ఆటోమేటిక్‌గా సంబంధిత కుటుంబాలకు అర్హత కలిగేలా భూభారతి పోర్టల్ ద్వారా సమస్య శాశ్వత పరిష్కారమవుతుంది.

ఆంధ్రజ్యోతి: భూ ఆధార్ ద్వారా ఎలాంటిప్రయోజనాలు ఉంటాయి ?

తహసీల్దార్: భూఆధార్ ద్వారా ఒక్కో సబ్‌డివిజన్‌కు ఒక్కో యూనిక్ కోడ్‌గుర్తించి ఇస్తారు. దీనికి ఆధార్ లాగా నెంబరు ఇస్తారు. తద్వారా రైతుల భూ సమస్యలు క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కార మార్గం సులభతరమవుతుంది.

ఆంధ్రజ్యోతి: భూ వివాదాల్లో రైతలకు ఎలాంటి స్థాయిలో పరిష్కారం లభించనుంది ?

తహసీల్దార్: మేజర్‌గా 85 శాతం భూ సమస్యలు ఆర్డీవో, తహసీల్దార్ ద్వారా సమస్యలు పరిష్కారిస్తాం. గ తంలో సీసీఎల్, కలెక్టర్ ద్వారా పరిష్కరించబడేవి. కోర్టుకు సంబంధించిన ఇనామ్, సీలింగ్, అసైన్డ్ తదితర భూ సమస్యలు ఆర్డీవో స్థాయి లో పరిష్కారం కానున్నాయి. పహణీలు, రిజిస్టర్ కాని భూములు సమస్యలన్నింటికీ ఆర్డీవో స్థాయి లోనే శాశ్వత పరిష్కార మార్గం లభించనుంది.

తప్పని రేషన్ తిప్పలు

(ఆంధ్రజ్యోతి- మాడ్గులపల్లి)

ప్రభుత్వం పేదలకు కడుపునిండా పట్టెడన్నం పెట్టాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సన్నబియ్యం పథకాన్ని ప్రా రంభించింది. కానీ కొత్త గ్రామ పంచాయతీల్లోని ప్ర జలకు రేషన్ సరుకులు పొందేందుకు కష్టాలు తప్ప డం లేదు. నూతన పంచాయతీల్లో రేషన్ దుకాణా లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపి నా ఇప్పటివరకు ఏర్పాటు కాలేదు.. దీంతో గ్రామాల్లో ప్రజలు పాత గ్రామ పంచాయతీ పరిధిలోగల రేషన్‌దుకాణాలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మాడ్గులపల్లి మండలం 20 గ్రా మాలతో 2016లో నూతన మండలంగా ఏర్పాటైంది. ఈ మండలంలో ప్రభుత్వం గ్రామపంచాయతీలను ఏర్పాటు చేయడంతో 8 గ్రామపంచాయతీలు పెరగడంతో మొత్తం 28 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 28 గ్రామాలకు 26 రేషన్ షాపులు, 10,652 రేషన్‌కార్డులు, 639 అంత్యోదయ కార్డులు ఉన్నాయి.



కేశవాపురం నుంచి బియ్యాన్ని మోసు కొస్తున్న నారాయణపురం గ్రామస్తుడు (ఫైల్)

» కొత్త పంచాయతీల్లో ఏర్పాటు కాని దుకాణాలు
» ప్రతిపాదనలు పంపినా పట్టించుకొని ప్రభుత్వం
» ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

ఏఏ గ్రామాలంటే..

మండలంలోని గంద్రవానిగూడెం, గారకుంటపాలెం,నారాయణపురం, మాచనపల్లి, గోపాలపురం, గ్రామాలకు రేషన్‌షాపులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గంద్రవానిగూడెం గ్రామానికి చెందిన ప్రజలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కుక్కడం గ్రామానికి వెళ్లి రేషన్ సరుకులను తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కుక్కడం వెళ్లాలంటే అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిని దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఉండడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే నారాయణపురం గ్రామాలకు చెందిన ప్రజలు 3 కి.మీ దూరంలో ఉన్న కేశవాపురానికి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే మాచనపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు కేశవాపురానికి, గోపాలపురం గ్రామానికి చెందిన ప్రజలు ధర్మాపురం, కన్నెకల్, గారకుంటపాలెం గ్రామానికి చెందిన ప్రజలు కన్నెకల్‌కు వెళ్లి సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పాత గ్రామపంచాయతీ పరిధిలో గల రేషన్‌షాపులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొనడంతో ఇటు వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలను తీర్చండంటూ అధికారులు విన్నవించినా పట్టించుకునేవారు కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన గ్రామపంచాయతీలకు రేషన్‌దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని తెచ్చుకోవాలంటే కుక్కడం గ్రామం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. 2 కి.మీ దూరంలో ఉన్న దుకాణానికి వెళ్లి బియ్యం తెచ్చుకోవాలంటే కష్టంగా ఉంది. దీంతో ఇబ్బందులుపడుతున్నాం. అధికారులు స్పందించి గంద్రవానిగూడెం గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి.
- బొబ్బిలి నరేష్ (గంద్రవానిగూడెం)

3 కిలోమీటర్లు నడవాల్సి వస్తుంది



రేషన్ బియ్యం తెచ్చుకోవాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుంది. కేశవాపురం వెళ్లాలంటే 3కి.మీ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు రేషన్ బియ్యం తీసుకోవాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం గ్రామంలో రేషన్ షాపును ఏర్పాటు చేయాలి.
- తవిటి సైదులు, నారాయణపురం

ప్రభుత్వానికి నివేదిస్తాం



నూతన గ్రామపంచాయతీల్లో రేషన్ దుకాణాల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిస్తాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే దుకాణాల ఏర్పాటుకు చర్యలు చేపడ్తాం. జిల్లా కలెక్టర్, సివిల్ సప్లయ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా.
- సురేష్‌కుమార్, తహసీల్దార్, మాడ్గులపల్లి

మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలి



సాగర్ సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నాగార్జునసాగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. నాగార్జునసాగర్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆరోపించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్పు చేసే ప్రయత్నం కొనసాగుతుందన్నారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా మే 20న పది ట్రేడ్ యూనియన్లతో కలిసి దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ సమ్మెలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు అన్ని సంయుక్తంగా జయప్రదం చేయాలని కోరారు. జమ్ము కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషమైన చర్య అన్నారు. కశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను తొలగించి ఉగ్రవాదాన్ని అరికడతామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మే 1 నుంచి 20వ తేదీ వరకు మేడే ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు.. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుత సైదులు, రాష్ట్ర నాయకులు ఎస్‌కే బషీర్, నాయకులు నాగార్జున, గోవిందరాజు, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి



దేవరకొండ సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌శర్మ

దేవరకొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలో నిర్మిస్తున్న బ్రాహ్మణ సంఘం భవన్ పూర్తి చేయాలని బ్రాహ్మణ సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కుర్మేటి రవిప్రసాద్‌శర్మ అన్నారు. స్థానిక కోదండ రామాలయంలో సోమవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండలో బ్రాహ్మణ సంఘం భవనానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. బ్రాహ్మణులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ప్రభుత్వ పథకాలు మం జూరు చేయాలన్నారు. కాశ్మీర్ పహల్గాం సంఘటన దురదృష్టకరమని కాల్పుల్లో మృతి చెందిన కుటుంబాలకు సంతాపం తెలిపినట్లు ప్రకటించారు. సమావేశంలో నాయకులు సురభి కృష్ణమూర్తిశర్మ, శ్రీనివాస్‌శర్మ, వైద్యుల కృష్ణమూర్తిశర్మ, ప్రభాకర్‌శర్మ, గంప శశికుమార్‌శర్మ, ప్రభాకర్‌శర్మ, నరహరిరావు, కిషోర్‌శర్మ పాల్గొన్నారు.

కుక్కల బెడద అరికట్టాలి

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలో కుక్కలబెడద అరికట్టాలని కోరుతూ సీతారాంపురం కాలనీ వాసులు మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా 28, 43వ వార్డుల్లో కుక్కల సంచారం అధికంగా ఉందని, స్థానికులపై దాడి చేసి గాయపరుస్తున్నాయని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో అరుస్తూ, తిరుగుతూ స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నాయన్నారు. కుక్కల దాడిలో చిన్నపిల్లలు గాయపడటం ఇటీవల కాలంలో ఎక్కువైందన్నారు. తగిన చర్యలు తీసుకుని కుక్కల బెడద అరికట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఎండీ. మగ్దూంపాషా, అయూబ్‌ఖాన్, ఖాదర్, నయీమ్, సాదిక్, షకీల్, మర్కప్‌పాషా మోయిజ్, బాబా పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీతారాంపురం కాలనీవాసులు

పదేళ్లలో కానరాని ప్రగతి ఏడాదిన్నరలోనే

మిర్యాలగూడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేయలేని అభివృద్ధి ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో చేసి చూపిందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాకునూరి బసవయ్య అన్నారు. స్థానిక ఎన్ఎస్పీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంగారు తెలంగాణ పేరు చెప్పి పదేళ్లలో పేదలకు కనీసం రేషన్‌కార్డులు సైతం మంజూరు చేయలేదన్నారు. డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల పేరుతో పేదల ఇళ్లను కూల్చి లక్షల్లో పేదలు దరఖాస్తు చేసుకుంటే వేలల్లో కూడ ఇళ్లు కట్టలేదని కట్టిన వందల ఇళ్లు శిథిలావస్థకు చేరినా ఒక్కరి కూడ పంపిణీ చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పేదలకు జరుగుతున్న ప్రయోజం గురించి కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల్లో అవగాహన పెంపొందించేందుకు కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మే4 న మిర్యాలగూడ ఎన్ఎస్పీ మైదానంలోప్రముఖ గాయనీ మంగ్లీతో ఆట పాటా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏ ర్పాటు చేసి సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల పార్టీ నాయకులు గుండు నరేందర్, శంకర్‌రెడ్డి లతో కలిసి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోలగాని వెంకటేశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఎస్‌కే.జిందా, ఇబ్రాయిల్, శంకర్‌నాయక్, దండ శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

చింతపల్లి : రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ పథకాలు అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన తెలిపారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో పారదర్శకంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

సభ విజయవంతం చేయడంపై కృతజ్ఞతలు

విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

హాలియా, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసిన బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. హాలియాలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనివినీ ఎరుగని రీతిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరిగిందని నాగార్జునసాగర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు సభకు హాజరయ్యారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రసంగం ఎంతో ఆకట్టుకుందని, రాబోయే రోజుల్లో అధికారంలోకి రావడం ఖాయమని కేసీఆర్ స్పష్టం చేశారని గుర్తుచేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎక్కలూరి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజుయాదవ్, పట్టణాధ్యక్షుడు వడ్డె సతీష్‌రెడ్డి, బీవీ రమణరాజు, దొరేపల్లి వెంకటేశ్వర్లు, అబ్దుల్ హలీం, అంజాద్‌ఖాన్, ఎల్లయ్య, జలీల్, బండి రమేష్, మద్దిమడుగు మార్క్ పాల్గొన్నారు.

కంప చెట్లు ఇలా..ప్రయాణం సాగేదేలా !



పోలేపల్లి, రాంనగర్ నుంచి గొడుకొండ్లలో వెళ్లే దారిని కమ్మేసిన కంపచెట్లు

చింతపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారిలో కంప చెట్లు దట్టంగా పెరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా .పోలేపల్లి ,రాంనగర్ నుంచి గొడుకొండ్లలో వెళ్లే దారిలో కంపచెట్లు రోడ్డు కమ్మేశాయి.అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయిందని స్థానికులు వాపోతున్నారు. దీంతో పాటు విద్యుత్ సౌకర్య లేకపోవడంతో రాత్రి వేళలో విష సర్పాలు వచ్చే అవకాశం ఉంటుందని నిత్యం వాహనదారులు భయందోళనకు గురవుతున్నారు.

సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మిర్యాలగూడటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని నాగార్జున జూనియర్ కళాశాల 1994-96లో ఇంటర్మీడియట్ హెచ్‌ఈసీ కోర్సు విద్యార్థులు సోమ వారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు దేశ, విదేశాల్లో స్థిరపడిన చిన్ననాటి మిత్రులతో కలిసి అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, నర్సింహరావు, అమరావతి సైదులు, దుర్గారెడ్డి, శ్రీనివాస్, వినోద, సరిత, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.


వరి పరిశోధనలో ముందడుగు

(5వపేజీ తరువాయి)

800 క్వింటాళ్ల బీపీటీ-5204, 300 క్వింటాళ్ల కేఎన్ఎమ్-1638, 50 క్వింటాళ్ల కేపీఎస్-2874, 50 క్వింటాళ్ల కేపీఎస్-6251, 100 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్-15048 విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి.

వరి సాగులో వివిధ పద్ధతులు..

వరి సాగు విధానంపై పరిశోధనలు జరుగుతున్నాయి. నేరుగా వెదజల్లడం, నాటుయంత్రం, మెట్ట వరి, డ్రమ్ సీడర్ పద్ధతుల్లో వరిసాగు చేపడుతున్నారు. సాగు ఖర్చులు, తెగుళ్ల నియంత్రణ, దిగుబడులు, గింజ నాణ్యత తదితర అంశాలపై విస్తృత పరిశోధనలు సాగిస్తున్నారు.



పరిశోధన స్థానంలో విశాలమైన ప్రధాన రహదారి

మార్కెట్లోకి నూతన వంగడాలు

నూతన వరి వంగడాల రూపకల్పనకు విస్తృత స్థాయిలో పరిశోధనలు సాగుతున్నాయి. విత్తనం వివిధ దశలు దాటి రైతు ల వద్దకు చేరాలంటే కనీసం 15 ఏళ్లు పడుతుంది. ప్రస్తుతం ప్రైవేటు విత్తనాలకు దీటుగా జేజీఎల్-27356, కేపీఎస్- 10642 రకాలు అందుబాటులో ఉన్నాయి. ఇవి పచ్చి ధాన్యం నేరుగా(ఆరబెట్టకుండా) విక్రయించుకోవడానికి అనుకూలమైన రకాలు. తెగుళ్లను సమర్థంగా తట్టుకోవడంతో సాగు వ్యయం తగ్గుతుంది. మంచి దిగుబడులు వస్తాయి. రైతులకు ప్రయోజనం కలుగుతుంది. రకాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.
-డాక్టర్ లింగయ్య, హెడ్ శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, కంపాసాగర్

పోరాటాలతోనే సమూల మార్పులు

లేదని, ఇవన్నీ లేకపోవడంతోనే ఈ దేశంలో దళిత, బహుజన వర్గాల పరిస్థితి దీనంగా ఉందన్నారు. దేశంలో దళిత, బహుజన వర్గాలు పనిచేసుకుంటూనే పనితో పాటు చదువు నేర్చుకోవాలని అంబేడ్కర్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

అంతరాలు సృష్టిస్తున్నారు

విద్య కింది వర్గాలకు అందకుండా నేడున్న ప్రభుత్వాలు అంతరాలు సృష్టిస్తున్నాయని కాశీం అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం మూస ధోరణిలో ఉందని, మొత్తంగా మనుధర్మశాస్త్రాన్ని, మనువాదాన్ని పాఠ్యాంశాలుగా చేర్చడానికి కుటిల ప్రయత్నాలు చేస్తోందన్నారు. విద్య వివేకం ఇవ్వాలని, వి ద్య చైతన్యం ఇవ్వాలని పూల, అంబేడ్కర్ కోరుకున్నారన్నారు. ఇప్పుడున్న పాలకులు మాత్రం మూఢనమ్మకాలు, అశాస్త్రీయ అంశాలను చొప్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కశ్మీర్ ఫైల్స్, రజాకార్ ఫైల్స్ వంటి సినిమాలు తీసి చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ భావజాలమే బడుగులకు మార్గమన్నారు. మతోన్మాద శక్తులు ఈ దేశంలో మనువాదాన్ని అడ్డం పెట్టుకొని పెట్రేగిపోతున్నాయన్నారు. దేశంలో బీజేపీ వివక్షను పెంచి పోషిస్తుందన్నారు. ఏపూరి సోమన్న ఆటపాటలతో అలరించారు. సభకు స్వాగతోపన్యాసం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున చేయగా, జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, ఎంజీయూ అధ్యాపకురాలు అనిత పాల్గొన్నారు.

క్రీడతో స్నేహ పూర్వక వాతావరణం



జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

వేములపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): క్రీడలు గ్రామాలు, యువత మధ్య స్నేహపూర్వక వాతా వరణానికి దోహదం చేస్తాయని ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని రావులపెంట గ్రామంలో సోమవారం ఫ్రెండ్స్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి స్నేహాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, మర్రి ఎలియాస్, నంద్యాల శ్రీరాంరెడ్డి, తరి సైదులు, బీరవెల్లి సతీష్ రెడ్డి, కందుల నాగిరెడ్డి, పీఈటీలు దేవేందర్‌రెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు

గుండెపోటుతో వ్యక్తి మృతి



ప్రభాకర్(ఫైల్)

చింతపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్) గ్రామానికి చెందిన జూపల్లి ప్రభాకర్(45) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. వెంకటేశ్వరనగర్(మాల్)లో నివాసం ఉంటూ హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. రోజు మాదిరిగానే వీధుల్లోకి వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. భోజనం చేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇంతలో ఛాతీలో నొప్పి వస్తుందని భార్యకు చెప్పడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. గుండెనొప్పి తీవ్రంగా రావడంతో మృతి చెందారు. మృతుడికిభార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.